Follow: @ANNTELUGU


ANN తెలుగు

10-01-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 40 పేజీలు-08 వెల-రూ.6


PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రాహుల్ గాంధీ.. కోల్డ్ కాఫీ

ఢిల్లీ, మహా: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల ఢిల్లీలోని కెవెంటర్స్ స్టోర్‌ను సందర్శించారు. అక్కడి ప్రజలతో కలిసి కోల్డ్ కాఫీ తాగారు. స్టోర్ వ్యవస్థాపకులతో ముచ్చటించారు. భవిష్యత్ ప్రణాళికలు, సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కెవెంటర్స్ వంటి ప్లేఫెయిర్ వ్యాపారాలు మనదేశ ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయి. ఇలాంటివి మరిన్ని తీసుకురావాలి.. కొత్త వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వండి అని ఎక్స్‌లో రాహుల్ పోస్టు చేశారు. తాను స్టోర్‌ను సందర్శించినప్పటి వీడియోను పంచుకున్నారు. కోల్డ్ కాఫీ ఎలా తయారు చేస్తారో చూడాలని అనుకుంటున్నారా అని అక్కడి సిబ్బంది రాహుల్‌ను అడగ్గా, లేదు.. నేనే తయారుచేస్తా అంటూ చేతికి గ్లౌజ్‌లు తొడుక్కుని స్వయంగా కోల్డ్‌కాఫీ తయారు చేశారు. కెవెంటర్స్ సహ వ్యవస్థాపకులు అమన్ అరోరా, అగస్త్య దాల్మియాతో వ్యాపారం గురించి రాహుల్ ఆరాతీశారు. టైర్ 2, టైర్ 3, టైర్ 4 నగరాలపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నామని, టైర్ 1 నగరాల్లో అద్దెలు సవాలుగా మారుతున్నాయని వారు వివరించారు. ప్రస్తుతం 65నగరాల్లో 200 స్టోర్లు ఉన్నాయని తెలిపారు.


గోవిందా..గోవిందా



### మీ తప్పులకు మేం తిట్లు తింటున్నాం

- మీ వద్ద దేనికీ సరైనా ప్రణాళిక లేదు
- పూర్తి విచారణ జరిపిస్తాం
- అధికారులపై పవన్ కల్యాణ్ ఫైర్

05



### తిరుపతి ఘటనలో ఇద్దరు అధికారులు సస్పెండ్

- మరో ముగ్గురని బదిలీ చేశాం..
- ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం..
- ఏపీ సీఎం చంద్రబాబు


05



### చంద్రబాబుదే బాధ్యత

- భగ్గుమన్న వైయస్ జగన్
- తొక్కిసలాట బాధితులకు పరామర్శ
- చంద్రబాబు సీఎం అయ్యాక టీటీడీ ప్రతిష్ట దెబ్బ తింటోంది
- ఈ ఘటన ప్రభుత్వ తప్పిదమే

05



## అలల ఊయలపై సీతారాములు..

అపురూపం రాములోరి జలవిహారం.. సీతారాముల జలవిహారం

ముగ్ధ మనోహరం...! వేద ఘోష పరిమళాలు...!

మిరిమిట్లు గొలిపే బాణసంచా వెలుగు జిలుగులు...!

అశేష భక్తజన సందోహం...!


జగదభి రామ జానకి రామా అంటూ భక్తుల జయ జయ ధ్వానాలు...!

శ్రీ సీతారామ లక్ష్మణ సమేతంగా గావించిన తెప్పోత్సవం

ఆబాల గోపాలాన్ని మైమరిపించింది...!

దక్షిణ అయోధ్య భద్రాచలం మురిసి మెరిసింది...!

03





### సీఎం రేవంత్ చెప్పారు.. నాగార్జున చేశారు

తెలంగాణ టూరిజంపై జబర్దస్త్ వీడియో

వివరాలు 2లో

### సీఎం రేవంత్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన రద్దు

15, 16 తేదీల్లో ఢిల్లీకి సీఎం

17న ఢిల్లీ నుండి సింగపూర్‌కు

విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

వివరాలు 3లో

#### స్టాక్ మార్కెట్

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ | ↗ | 77,620.21 |
| నిఫ్టీ | ↗ | 23,526.50 |

#### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

#### ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.85 | 145.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 4.85 | 145.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| ₹ 5.14 | 154.23 |



# 4 ప్రశ్నలను 40 రకాలుగా అడిగారు

## ఏసీబీ విచారణపై కేటీఆర్

ఆరున్నర గంటలపాటు విచారణ

రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అడిగారు

ఎపుడు పిలిచినా విచారణకు వస్తానని వెల్లడి

02

హైదరాబాద్, మహా: తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమారుడు, మాజీమంత్రి కేటీఆర్‌పై ఏసీబీ విచారణ గురువారం జరిగింది. గత కొన్ని వారాలుగా జరుగుతున్న కీలక పరిణామాల నడుమ కేటీఆర్ గురువారం ఏసీబీ ఎదుట హాజరయ్యారు. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణ ముగిసింది. సుమారు ఆరున్నర గంటల పాటు కేటీఆర్ను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఏసీబీ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని కేటీఆర్ మీడియాకు తెలిపారు. అధికారులకు అన్ని విధాలా సహకరించానని, విచారణకు ఎన్ని సార్లు పిలిచినా, హాజరవుతానని తెలిపారు.

### సుప్రీంలో దక్కని ఊరట.. 15న విచారణ

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను రేపు (శుక్రవారం) విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈనెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

## భూ భారతికి గవర్నర్ ఆమోదం

### రాష్ట్ర చరిత్రలో మరో మైలురాయి

మంత్రి పొంగులేటిని, రెవెన్యూ యంత్రాంగాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

భూ సమస్యల పరిష్కారానికి రాచబాట.. గ్రామస్థాయి రెవెన్యూ సేవలకు పునాదులు

కార్యాచరణ ప్రారంభించాలని మంత్రి పొంగులేటి ఆదేశం

భూభారతి చట్టం ద్వారా నూతన శకానికి పునాదులు – మంత్రి పొంగులేటి

పొంగులేటిని కలిసిన నవీన్ మిట్టల్, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు



హైదరాబాద్, మహా: భూభారతి చట్టం అమలుకు దారి తీసిన ప్రతి అడుగు చారిత్రాత్మకమే. ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామంటూ ఎన్నికల సమయంలో ప్రతీ సభలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లే దానిని విసిరేయగా, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి పట్టుదల, దీక్షతో కొత్త చట్టం రూపొంది ఇపుడు మరోదశకు చేరింది. రాష్ట్ర చరిత్రలో ఇదో మైలురాయి. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టానికి ఆమోద ముద్ర పడింది. భూభారతి చట్టానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

మిగతా 2లో

## అన్ని టికెట్లకు ఒకటే యాప్

- పౌర సేవలు మరింత సులభం
- మీ టికెట్ యాప్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు



వివరాలు 2లో



## పుణ్యక్షేత్రంలో మృత్యుపాశం

కొండపై ఘోరం ఎలా జరిగింది?

04

## గ్రామపంచాయతీల బిల్లులు చెల్లించండి

- ఈజీఎస్ బిల్లులు క్లియర్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- గ్రీన్ ఛానల్ ద్వారా పంచాయతీ ఉద్యోగులకు నెలనెలా జీతాలు
- పంచాయతీరాజ్ శాఖపై సీఎం సమీక్ష.. కీలక నిర్ణయాలు



02



# 4 ప్రశ్నలను 40 రకాలుగా అడిగారు

## ఏసీబీ విచారణపై కేటీఆర్

ఆరున్నర గంటలపాటు విచారణ

రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అడిగారు

ఎపుడు పిలిచినా విచారణకు వస్తానని వెల్లడి

సుప్రీంలో కేటీఆర్‌కు దక్కని ఊరట.. 15న విచారణ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమారుడు, మాజీమంత్రి కేటీఆర్‌పై ఏసీబీ విచారణ గురువారం జరిగింది. గత కొన్ని వారాలుగా జరుగుతున్న కీలక పరిణామాల నడుమ కేటీఆర్ గురువారం ఏసీబీ ఎదుట హాజరయ్యారు. ఫార్ములా ఈరేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణ ముగిసింది. సుమారు ఆరున్నర గంటల పాటు కేటీఆర్ను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఏసీబీ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని కేటీఆర్ మీడియాకు తెలిపారు. అధికారులకు అన్ని విధాలా సహకరించానని, విచారణకు ఎన్ని సార్లు పిలిచినా, హాజరవుతానని తెలిపారు. ఇదొక చెత్త కేసు అని దర్యాప్తు అధికారులకు తెలిపినట్లు కేటీఆర్ చెప్పారు.

**ఎప్పుడు పిలిచినా రెడీ- కేటీఆర్**

విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. అయితే నాలుగు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు తెలిపారు కేటీఆర్. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో అరెస్ట్ అవుతారా అని బీఆర్ఎస్ వర్గాలు భయాందోళన చెందాయి. విచారణ సమయంలో కేటీఆర్ వెంట న్యాయవాది రామచంద్రరావు కూడా ఉన్నారు. కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్ కేటీఆర్‌ను విచారించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ విచారణను పర్యవేక్షించారు. ఈ విచారణను వేరే గది కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావు చూసేలా ఏర్పాట్లు చేశారు.

**రూ. 55 కోట్ల చుట్టూ..**

కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించడానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పూర్తి విచారణ కోసం కేటీఆర్ ఈరోజు ఉదయం ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట న్యాయవాది రామచంద్రరావు కూడా హాజరయ్యారు. కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్ మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరిగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్‌న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు.

**కేటీఆర్ ను అడిగిన ప్రశ్నలు ఇవే..**

- రూ. 55 కోట్లు విదేశీ కంపెనీకి ఎందుకు చెల్లించారు?
- ఇది నిబంధనలకు విరుద్ధమని మీకు తెలియదా?
- ఆర్బీఐ పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు?
- కేబినెట్ ఆమోదం లేకుండానే నిధులు మళ్లింపా?
- ఆర్థిక శాఖ పర్మిషన్ అవసరం లేదనుకున్నారా?
- అగ్రిమెంట్లు, చెల్లింపులన్నీ మీ ఆధ్వర్యంలోనే జరిగాయా?
- కేటీఆర్ ఆదేశాల మేరకే నగదు రిలీజ్ చేశామన్న అధికారులు చెపుతున్నారు మీ సమాధానం ఏంటి ?
- అసలు హైదరాబాద్‌లో ఫార్ములా రేస్ ప్రతిపాదన ఎవరిది ? ఈ ప్రతిపాదనను ఎవరు ఆమోదించారు ?
- హైదరాబాద్‌లోనే ఈ ఫార్ములా రేస్‌ను ఎందుకు నిర్వహించాలనుకున్నారు ?
- రేస్ నిర్వహించడం వలన ప్రభుత్వానికి ఏమైనా ప్రయోజనం లభించిందా?
- ఎఫ్ఈవో కంపనీకే ఎందుకు ఈ రేస్ నిర్వహణ బాధ్యతలు ఇచ్చారు?
- కేటీఆర్ , మీకు అధికారులు నగదు బదిలీ చేస్తే ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారా ?
- నగదు బదిలీ అనే అంశం నిబంధనలకు విరుద్ధం అనేది మీ అధికారులు మీ దృష్టికి తీసుకొచ్చారా ?
- నిబంధనలు విరుద్ధంగా నగదు బదిలీ చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయని అధికారులు మీకు చెప్పారా ? హెచ్చరించారా ?
- నిబంధనలు పట్టుంచుకోకుండా 55 కోట్లు నగదు ఎందుకు బదిలీ చేయాల్సి వచ్చింది ?
- నగదు బదిలీ చేసే సమయంలో రూల్స్ బ్రేక్ చేయమని మీరే చెప్పారా ?
- అరవింద్ కుమార్ మాత్రం మీ ఆదేశాలతో నగదు బదిలీ చేశామని వాంగ్మూలం ఇచ్చారు. దీనికి మీ సమాధానం ఏంటి ?
- గ్రీన్ కో కంపనీ స్పాన్సర్ షిప్ నుంచి వైదొలిగింది ?
- స్పాన్సర్ షిప్‌లో ఉన్న కంపనీ మీకు ఎలక్ట్రోల్ బాండ్లు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది ?
- ఈ స్పాన్సర్ షిప్ ద్వారా ఆ కంపెనీకి ప్రయోజనం చేకూరిందా ?
- మీపై మోపిన అభియోగాలు పై మీరు ఏమి చెప్పాలనుకుంటున్నారు ?
- నగదు బదిలీ అంశం కేబినెట్ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదు ? కేబినెట్ నుంచి అనుమతులు లేకుండా ఎలా బదిలీ చేస్తారు ?
- బదిలీ అయిన నగదు తిరిగి హెచ్ఎండీఏ ఖాతాకు వచ్చిందా లేదా ? మీకు సమాచారం ఏమైనా ఉందా ? అంటూ వరుసగా ఏసీబీ ప్రశ్నలు సంధించింది.



### ఈడీ విచారణకు హాజరైన అరవింద్

మరోవైపు ఫార్ములా ఈ కేసులో అటు ఏసీబీ.. ఇటు ఈడీ అధికారులు దూకుడు పెంచారు. ఓ వైపు కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తుండగా.. ఈ కేసులో ఏ2 గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఈడీ అధికారులు విచారించారు. ఈడీ విచారణకు అరవింద్ కుమార్ హాజరయ్యారు. నిన్న ఏసీబీ విచారణను అరవింద్ కుమార్ ఎదుర్కొన్న విషయం తెలిసిందే. దాదాపు ఆరు గంటల పాటు ఐఏఎస్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఆయన నుంచి పలు కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అరవింద్ కుమార్, దాన కిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తానే డబ్బులు ఇవ్వమని ఆదేశించానని, ఇచ్చిన డబ్బులు అక్కడ ఉన్నాయని.. ఇందులో అవినీతి ఎక్కడుందని కేటీఆర్ ఏసిబి ముందు వాదించారు.

# భూ భారతికి గవర్నర్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించగా, డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది. గురువారం భూభారతి చట్టానికి ఆమోదం తెలుపుతూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే భూభారతి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు చేస్తోంది. గవర్నర్ ఆమోదించిన భూభారతి బిల్లు కాపీని గురువారం సచివాలయంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డికి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా చట్టాన్ని అమలులోకి తెస్తామన్నారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఆర్వోఆర్ 2020 వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తెలంగాణ భూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోన్న భూభారతి చట్టంకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం లభించింది. భూమి సంబంధిత సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు శాశ్వత పరిష్కారాన్ని అందించేందుకు రూపొందించిన ఈ చట్టం త్వరలో అమలులోకి రానుంది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ చట్టానికి సంబంధించిన కార్యాచరణ తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.



### పారదర్శక చట్టం

భూభారతి చట్టం అమలుకు దారి తీసిన ప్రతి అడుగు చారిత్రాత్మకమే. ఈ చట్టం ప్రవేశంతో రైతులు, సామాన్య ప్రజలు, గ్రామాల స్థాయి నుంచి పట్టణాల వరకు, రెవెన్యూ వ్యవస్థలో మార్పును అనుభవించనున్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించి, భూ నిర్వహణలో పారదర్శకత, సమగ్రతను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యంగా ఉంది. తెలంగాణలో భూ సమస్యలు తరచుగా రైతులకు, సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. పాతతరపు రెవెన్యూ విధానాల వల్ల భూమి హక్కులపై అనేక వివాదాలు, న్యాయపరమైన సమస్యలు తలెత్తాయి. భూభారతి చట్టం అమలుతో ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ చట్టం ద్వారా రాష్ట్ర ప్రజలకు భూ హక్కులపై పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీనివాస రెడ్డి చెప్పారు.

### గ్రామస్థాయి నుండి రెవెన్యూ సేవలు


భూభారతి చట్టం కింద గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలను మరింత సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమించడం ద్వారా గ్రామస్థాయిలో భూమి నిర్వహణను పటిష్టం చేయనున్నారు. రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువ అవ్వడంతో, భూమి సంబంధిత సేవలపై నమ్మకం పెరుగుతుందని భావిస్తున్నారు. గతంలో రెవెన్యూ చట్టాలు సరైన విధంగా అమలుకావడం లేదని, వాటి వల్ల రైతులు, సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. భూ సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపిస్తూ, భూభారతి చట్టం తీసుకురావడం ద్వారా నూతన శకానికి పునాదులు వేస్తున్నామని తెలిపారు. భూభారతి చట్టం కింద భూమి నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. భూమి రికార్డులను డిజిటలైజ్ చేసి, పారదర్శకంగా భూ హక్కులను గుర్తించనున్నారు. రైతులు, భూయజమానులకు వారి హక్కులపై పూర్తి స్పష్టత లభించనుంది. భూమి లావాదేవీలు వేగంగా, న్యాయంగా జరిగే విధానానికి ఈ చట్టం దోహదపడుతుంది. భూభారతి చట్టం తెలంగాణ భూమి పరిపాలనలో విశిష్ట దశగా నిలుస్తుందని ప్రజలంతా ఆశిస్తున్నారు.

# అన్ని టికెట్లకు ఒకటే యాప్

**పౌర సేవలు మరింత సులభం ■ మీ టికెట్ యాప్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రవ్యాప్తంగా వివిధ సేవలను సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్తగా "మీ టికెట్" యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా వివిధ రకాల టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు. ఆర్టీసీ, మెట్రో, ఆలయ దర్శనం, జూ పార్కులు, బోటింగ్, మ్యూజియంలు, వినోదం టిక్కెట్లు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ (ఈఎస్‌డీ) రూపొందించిన అధునాతన 'మీ టికెట్' యాప్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి తరహా యాప్ లను మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ యాప్ లో తెలంగాణలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, జూ పార్క్, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్‌టైన్ మెంట్ జోన్స్ కు సంబంధించిన టికెట్లను తీసుకోవచ్చని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.





# సీఎం రేవంత్ చెప్పారు.. నాగార్జున చేశారు

### తెలంగాణ టూరిజంపై జబర్దస్త్ వీడియో

**హైదరాబాద్, మహా:** తెలంగాణ టూరిజంను సెలబ్రిటీలు ప్రమోట్ చేయాలని.. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, సైబర్ క్రైమ్ వంటి వాటిపై అవగాహన కల్పించేలా వీడియోలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల సినీప్రముఖులకు సూచించారు. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు ఒక్కొక్కరు ఒక టాపిక్ తీసుకొని వీడియోలు విడుదల చేయగా.. తాజాగా, టాలీవుడ్ కింగ్ నాగార్జున ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఈ జబర్దస్త్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సీఎం రేవంత్ చెప్పారు.. కింగ్ నాగ్ చేశారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు అభినందిస్తున్నారు. తెలంగాణలో ఉన్న టూరిజంను వివరిస్తూ చక్కటి వీడియోని కింగ్ నాగ్ విడుదల చేశారు. తెలంగాణలోని పర్యాటక ప్రదేశాలు, టెంపుల్ టూరిజం, తెలంగాణ వంటకాలను ఆ వీడియోలో ప్రదర్శిస్తూ వివరించారు. తెలంగాణలో చూడదగ్గ ప్రదేశాలు, రుచి చూడాల్సిన వంటకాలు, దర్శించుకోవాల్సిన దేవాలయాలను కళ్లకు కట్టినట్లుగా చూపించారు. తెలంగాణ టూరిజం శాఖ అధికారిక ట్విట్టర్ ఎక్స్ ఖాతా ఈ వీడియోను పోస్ట్ చేస్తూ నాగార్జునకు ధన్యవాదాలు తెలిపారు.

# వారం రోజుల్లో 50 మందికి బట్టతల

### మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాలో ఘటన

వరుసగా బట్టతల బాధితులుగా మారుతున్న ప్రజలు

ఆందోళనలో మూడు గ్రామాల ప్రజలు

ఆయా గ్రామాలను సందర్శించిన వైద్యాధికారులు

నీరు, జుట్టు, స్కిన్ శాంపిల్స్ సేకరణ



**మహా:** జుట్టు అనేది మహిళలకే కాదు మగాళ్లకు ముఖ్యమే. అందంలో కేశ సంపద ప్రధాన పాత్ర పోషిస్తుంది. పొడుగైన జుట్టు అమ్మాయిలకు ఎంత ఇష్టమో.. తలపై ఒత్తుగా, నిండైన కేశాలు ఉండటం కూడా అబ్బాయిలకు అంతే ఇష్టం. ఈ సమస్యతో కొందరు మానసిక వేదనకు గురవుతారు. మహారాష్ట్రలో మూడు గ్రామాల ప్రజలకు విచిత్రమైన పరిస్థితి ఎదురయ్యింది. వారం రోజుల వ్యవధిలో 50 మంది బట్టతల బాధితులుగా మారారు. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఏం జరుగుతోందో అర్థం కాక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా బుల్దానా జిల్లా షెగాన్ తాలూకాలోని జిల్లాలోని బోర్గావ్, కల్వాడ్, హింగ్నా గ్రామాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ గ్రామాల్లో రోజురోజుకు బట్టతల బాధితులు పెరుగుతుండటంతో వైద్యాధికారులు స్పందించారు. ఆ గ్రామస్థులు బట్టతల సమస్యతో బాధపడుతున్నారు. వేగంగా తలపై వెంట్రుకలు రాలిపోతుండటంతో వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ఒకసారి రాలడం మొదలైన తర్వాత కొద్ది రోజుల్లో బోడిగుండుగా మారిపోతోంది. వారం వ్యవధిలోనే ఓ వ్యక్తికి బట్టతల ఏర్పడటంతో మరింత కలవరపడుతున్నారు.

### ల్యాబ్ రిపోర్ట్ కోసం వెయిటింగ్

వారి సమస్య తీవ్రతరం కావడంతో వైద్యశాఖకు చెందిన ఉన్నతాధికారులు స్పందించారు. ఆ గ్రామాలకు చేరుకుని బాధితులను కలిసి.. సమస్యకు కారణాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. రసాయన ఎరువులతో నీరు కలుషితం కావడం, ఆరోగ్య సమస్యల వల్లే ఇలా జరుగుతున్నట్టు అనుమానిస్తున్నారు. బాధితుల తలపై కేశాలు, చర్మ నమూనాలను సేకరించి, పరీక్షల కోసం పంపారు. త్వరలోనే కచ్చితమైన కారణాన్ని గుర్తిస్తామని అధికారులు తెలిపారు. మూడు గ్రామాల్లో కనీసం 50 మంది ఇప్పటి వరకు బట్టతల బారినపడినట్టు వైద్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని వైద్యులు సైతం ఆందోళన చెందుతున్నారు. ల్యాబ్ రిపోర్ట్ కోసం తాము వేచిచూస్తున్నామని వారు చెప్పారు.

# గ్రామపంచాయతీల బిల్లులు చెల్లించండి

**ఈజిఎస్ బిల్లులు క్లియర్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం.. గ్రీన్ ఛానల్ ద్వారా పంచాయతీ ఉద్యోగులకు నెలనెలా జీతాలు.. పంచాయతీరాజ్ శాఖపై సీఎం సమీక్ష.. కీలక నిర్ణయాలు**

**హైదరాబాద్, మహా:** గ్రామపంచాయతీలలో పేరుకుపోయిన బిల్లుల్లో ఈజిఎస్ బిల్లులు తక్షణమే క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం పంచాయతీరాజ్ శాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెల నెలా చెల్లించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పని చేస్తుండగా, వారికి ప్రతి నెలా రూ. 116 కోట్లు జీతాలు చెల్లించాల్సి ఉంది. వారందరికీ ప్రతి నెలా గ్రీన్ చానెల్ ద్వారా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బిల్లులను తొందరగా చెల్లించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని, వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలని చెప్పారు. కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాబట్టుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు ధనసరి సీతక్క , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , కొండా సురేఖ , ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు , వేం నరేందర్ రెడ్డి , మాజీ మంత్రి కె.జానారెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# అలల ఊయలపై సీతారాములు..



**భద్రాచలం, మహా:** భద్రాచలం మహా పుణ్యక్షేత్రం. పుణ్య తీర్థం కూడా. ముక్కోటి వేడుక తరతరాలుగా సాంప్రదాయ బద్ధంగా ఇక్కడ వైభవంగా జరుపుతారు. ఈ ఏడాది శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయన మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంకాల సంధ్యా సమయాన భద్రాచల పవిత్ర పావన గౌతమి నదీ తీరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి జలవిహారం వేడుక కనుల పండువుగా, కమనీయంగా, రమనీయంగా నిర్వహించారు. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల రామాలయంలో తొలుత వేద పండితులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాజభజంత్రీల సందడి నడుమ, పల్లకిపై శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని వేంచేయింపచేసి, భక్తుల జయ జయ ద్వానాలతో ఊరేగింపుగా పవిత్ర గౌతమీనది తీరానికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంస వాహనంపై లక్ష్మణ సమేతుడైన సీతారాములువారిని ఆసీనులను చేసి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదికి హారతులు ఇచ్చారు. వేద మంత్రాలను పఠించారు. విద్యుత్ కాంతులు మిరుమిట్లు గొలుపుతుండగా, గోదారమ్మ పులకిస్తుండగా, శ్రీరామ జయరామ అంటూ భక్తులు నినదిస్తుండగా, వేదగోష పరిమళాలు వెదజల్లుతుండగా ఆ చూడాముచ్చటైన అపురూప జంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారు జలవిహారం చేసిన తీరు భక్తులను తన్మయానికి గురిచేసింది. బాణాసంచా సందడి భక్తులను అలరించింది. పవిత్ర పావన గౌతమీ



నదీ తీరంలో ఐదు సార్లు హంస వాహనంపై తిరుగుతూ వైకుంఠ రాముడు భక్తులకు సాక్షాత్కరించారు. మరోవైపు రకరకాల విద్యుత్ కాంతులతో బాణాసంచా కాల్చిన తీరు భక్తులను తన్మయానికి గురిచేసింది. గోదావరి ఇసుక తిన్నలపై కూర్చొని కనులారా ఈ వేడుక తిలకించిన భక్తజన హృదయాలు ఉప్పొంగాయి. శ్రీరామ..జయ రామ అంటూ భక్తులు చేసిన జయ జయ ద్వానాలు మిన్నంటాయి. గోదావరి తీరం అంతా జనసంద్రమైంది. గోదావరి తీరం వద్ద ప్రత్యేక ఆకర్షణగా ఈసారి అధికారులు తీసుకున్న చర్యలు భక్తులను ఆకర్షించాయి. ఈ సంవత్సరం ఏరు (రివర్) ఫెస్టివల్ ఆదివాసి గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు మరియు గిరిజన వంటకాలు వారి కల్చర్ సంబంధించిన కార్యక్రమాలు గిరిజన విద్యార్థిని విద్యార్థులచే ఏర్పాట్లు చేసి భక్తులకు కనువిందు కలిగేలా వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. భద్రాచలంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ స్వామివారి తెప్పోత్సవ వేడుకలో... తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ ఎండి విపి గౌతమ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, జిల్లా వివిధ శాఖల అధికారులు, రామాలయం వేద పండితులు, ఉద్యోగులు,అర్చక స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన రద్దు

### 15, 16 తేదీల్లో ఢిల్లీకి సీఎం.. 17న ఢిల్లీ నుండి సింగపూర్‌కు

### విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. ఈనెల జనవరి 13వ తేదీ నుంచి 23 వరకు సింగపూర్, స్విట్జర్లాండ్, బ్రిస్బేన్, దావోస్ దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉందని సీఎం ఏసీబీ కోర్టును కోరారు. ఈ అంశాన్ని పరిశీలించిన న్యాయస్థానం, రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చింది. గతంలో ఓటుకు నోటు కేసు బెయిల్ సందర్భంగా పాస్‌పోర్టును సీఎం రేవంత్ రెడ్డి కోర్టుకు అప్పగించారు. ప్రస్తుతం విదేశాలకు వెళ్లాల్సి ఉందని తన పాస్‌పోర్టును 6 నెలలు ఇవ్వాలనే సీఎం అభ్యర్థనకు కూడా ఏసీబీ కోర్టు అంగీకారం తెలిపింది. తిరిగి 2025 జులై 6వ తేదీ లోపు పాస్‌పోర్టు తిరిగి అప్పగించాలని రేవంత్‌రెడ్డిని ఏసీబీ కోర్టు ఆదేశించింది.

**ఆస్ట్రేలియా పర్యటన రద్దు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఆస్ట్రేలియా పర్యటన పూర్తిగా రద్దయ్యింది. ఈ నెల 14న సీఎం ఢిల్లీ వెళ్లనున్నారు. 15, 16 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. 15వ తేదిన దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న ఏఐసీసీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.



ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో

17వ తేదీన సీఎం ఢిల్లీ నుంచి నేరుగా సింగపూర్ వెళ్లనున్నారు. 17, 18వ తేదీల్లో రెండ్రోజుల పాటు సీఎం రేవంత్ రెడ్డి సింగపూర్లో పర్యటిస్తారు. అక్కడ నుంచి 19వ తేదిన దావోస్లో జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొంటారు. జనవరి 24వ తేది వరకు సీఎం దావోస్ పర్యటనలో ఉంటారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కాగా ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్లో క్రీడా పాలసీని అధ్యయనం చేయడానికి వెళ్లే ముఖ్యమంత్రి బృందం పర్యటన ఏఐసీసీ కార్యాలయ ప్రారంభోత్సవ వేడుక నేపథ్యంలో క్యాన్సిల్ అయ్యింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్లో మార్పులు చేసినట్లు ప్రకటించింది.

## కేటీఆర్ విచారణ నిద్రపోయిన అడ్వకేట్

**హైదరాబాద్, మహా:** అడ్వకేట్ ఉంటేనే విచారణకు వెళ్తానని అన్నారు.. అడ్వకేట్ కోసం కోర్టు మెట్లు కూడా ఎక్కారు. అయితే, ఎంతో ధైర్యంగా ఉంటుంది అని కేటీఆర్ భావిస్తే నిద్రపోయి ఆయననే షాక్ కు గురిచేశారు. చివరకు నిద్రపోతున్న ఆ అడ్వకేట్ ను కేటీఆర్ నిద్రలేపాల్సి వచ్చింది. కాగా, ఫార్ములా ఈకార్ రేస్ కేసులో గురువారం కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. బంజారాహిల్స్ లోని ఏసీబీ ఆఫీసులో అధికారులు ఆయనను విచారించారు. ఈ విచారణకు కేటీఆర్ తన వెంట అడ్వకేట్ ను కూడా తీసుకెళ్లారు. ఇందుకోసం ఆయన హైకోర్టుకు వెళ్లి ప్రత్యేక పర్మిషన్ సైతం తెచ్చుకున్నారు. కానీ, ఆయనకు విచారణ సమయంలో ఆ అడ్వేకట్ నిద్రపోయి షాక్ గురిచేశారు. విచారణ మధ్యలో లంచ్ టైంకి బయటకు వచ్చిన కేటీఆర్.. మరో గదిలో ఉన్న తన అడ్వకేట్ దగ్గరకు వెళ్లారు. అప్పుడు ఆయన నిద్రపోతూ కనిపించారు. దీంతో ఆయనే స్వయంగా వెళ్లి ఆ అడ్వకేట్ ను నిద్రలేపాల్సి వచ్చింది. దీంతో, విచారణ సందర్భంగా ఏం జరుగుతుందో పరిశీలించాలని అడ్వకేట్ ను తన వెంట తీసుకెళ్తే విచారణ జరుగుతున్నంత సేపు ఆ అడ్వకేట్ నిద్రలోనే ఉండడంతో కేటీఆరే షాక్ అవ్వాల్సి వచ్చింది.

## కేటీఆర్ సైనికుడు కాదు... ఒక యువరాజు

### మరోసారి తెలంగాణ ప్రజలకు చెవిలో పువ్వు పెట్టొద్దు కేటీఆర్

### ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** కేటీఆర్ సైనికుడు కాదు... ఒక యువరాజు అంటూ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'మాకు డబ్బు వ్యామోహం లేదు అని కేటీఆర్ అంటున్నాడు.. కమీషన్ల కోసమే మీ సోదరి ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేశారు. మరోసారి తెలంగాణ ప్రజలకు చెవిలో పువ్వు పెట్టొద్దు కేటీఆర్. కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడు. మీకు డబ్బు వ్యామోహం లేదంటే ప్రజలు ఎలా నమ్ముతారు. రూ. 7 లక్షల కోట్లలో కాంట్రాక్టర్లకు ఎన్ని లక్షల కోట్లు అప్పనంగా ముట్ట చెప్పారు చెప్పాలి. పాత పాటలు పాడొద్దు కేటీఆర్ కొత్త ముచ్చట చెప్పండి తెలంగాణ ప్రజలు నమ్ముతారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని మీరు జీర్ణించుకోలేకపోతున్నారనేది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. కేటీఆర్ మీరు కేసీఆర్ సైనికునివి కాదు, నువ్వు కేసీఆర్ కొడుకు వు మాత్రమే. అధికారం కోల్పోయిన యువరాజుకు మతిభ్రమించి మా



ట్లాడుతున్నాడు. మీ నాయన 2002లో ఏదైతే నినాదంతో వచ్చాడో ఈరోజు మీరు కూడా అదే నినాదం చెబుతున్నారు. కానీ, తెలంగాణ ప్రజలు ఇంకా మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరు. దళిత ముఖ్యమంత్రి, ఉద్యోగ నియామకాలు కాపల కుక్కని అని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారు. మీరు అప్పు చేసిన రూ. 7 లక్షల కోట్లు సరైన పద్ధతిలో ఖర్చు చేసుంటే కేజీ టు పీజీ ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా, హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం ఇవన్నీ అందేవి. చేసిన ఆ అప్పులో రూ. లక్ష కోట్లు దండుకున్నది మీ కుటుంబం' అంటూ ఆయన పేర్కొన్నారు.

## స్టేట్ ఫెస్టివల్‌గా జైపాల్‌రెడ్డి జయంతి

### సీఎస్ శాంతికుమారి

**హైదరాబాద్, మహా:** మాజీ కేంద్ర మంత్రి, దివంగత ఎస్.జైపాల్ రెడ్డి 83వ జయంతిని ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. ఈ నెల 16న ఎస్. జైపాల్ రెడ్డి జయంతిని స్టేట్ ఫంక్షన్‌గా జరుపుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత అధికారులతో సీఎస్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లో జైపాల్ రెడ్డి మెమోరియల్ స్ఫూర్తి స్థల్‌లో సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ కమీషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు శానిటేషన్, పార్కింగ్, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు.

# గుట్ట మీద పాము పడగ

### పాము పొట్టలో ప్రత్యేక విగ్రహాలు

### ఆ పక్కనే ప్రసిద్ధ దేవాలయం.. నాంపల్లికి క్యూ కడుతున్న భక్తులు

**మహా ప్రత్యేకం:** ఆలయాలు, మంధిరాలు, దేవాలయాలు సాధారణంగా మనకు ప్రత్యేక ప్రదేశాలల్లో నిర్మించబడి ఉంటాయి. లేదా ఎత్తైన ప్రాంతాల్లో ఉంటాయి. మరికొన్ని ప్రాంతాల్లో లోతైన ప్రాంతాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిర్మిస్తుంచి ఉంటాయి. మరికొన్ని ప్రాంతాల్లో బండ సొరికలల్లో దేవాలయాలు ఉన్న సందర్భం మీరు చూసే ఉంటారు. కానీ, తెలంగాణలోని ఓ నరసింహస్వామి ఆలయం చాలా ప్రత్యేకం. ఈ ఆలయాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించారు. దాని పక్కన ఓ భారీ పామును కూడా నిర్మించారు. ఈ దేవాలయం పురాతనమైనదిగా చెబుతారు. ఒక భారీ రాతితో జతచేయబడి ఉంటుంది. ఇది ఒక సంభావ్య విగ్రహాన్ని సూచిస్తుంది. దేశంలోనే ఈ ఆలయం ప్రత్యేకమని చెబుతుంటారు. దీనిని పాముల గుడి అని కూడా పిలుస్తుంటారు. ఈ ఆలయాన్ని పూర్తిగా గుట్ట మీద నిర్మించారు. ఈ గుట్ట భారీ ఎత్తులో ఉంటుంది. నరసింహాస్వామి కొలువై ఉండే ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. స్వామివారిని దర్శించుకోవాలంటే నిటారుగా ఉన్న వందల మెట్లను ఎక్కాల్సి ఉంటుంది. అప్పుడు నరసింహాస్వామి భక్తులకు దర్శనమిస్తారు.

**ఏటవాలుగా నిర్మించిన వందల మెట్లు...**

ఇది విష్ణువు అవతారమైన లక్ష్మీ నరసింహ స్వామికి ఈ ఆలయాన్ని అంకితం చేయబడింది. స్వామివారి విగ్రహాన్ని రాతి నుండి చెక్కబడి ఉంటుంది. సందర్శకులు గుట్టపైకి రావాలంటే కొన్ని వందల మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. కొంచెం ఏటవాలుగా ఉండే మెట్లను ఎక్కేందుకు 15 నిమిషాలకు పైగా సమయం పడుతుంది.

**సంతానం లేని భక్తుల సంఖ్య ఎక్కవ..**

భక్తులు ఇక్కడికి భారీగా తరలివచ్చి నరసింహాస్వామిని దర్శించుకుంటారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ ఆలయానికి భారీగా భక్తులు వస్తుంటారు. తాము కోరుకున్నది ఖచ్చితంగా జరుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ముఖ్యంగా సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తులు బలంగా నమ్ముతుంటారు. 'చోళుల కాలంలో క్రీ.శ 11వ శతాబ్ధంలో శ్రీ రాజరాజ నరేంద్రుడు అనే రాజు, ఆయన సతీమణి రత్నంగికి సంతానం కలుగక ఎంతో మనోవేదన గురవుతుంటారు. ఈ క్రమంలో



వేములవాడ నుంచి నాంపల్లి గుట్టకు రుషువులు నడుచుకుంటూ వస్తున్న క్రమంలో వారికి రత్నంగి ఎదురవగా, బాధతో ఉన్న ఆమెను గుర్తించి... తల్లి మీరు సంతానం విషయమై ఆవేదన చెందుతున్నారు.. మీకు సంతానం కలగాలంటే నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహా స్వామిని దర్శించుకొని, 41 రోజులపాటు ప్రత్యేక దీక్ష చేపట్టి పూజలు చేయాలని ఆమెకు చెబుతారు. దీంతో వారు చెప్పినట్టుగా ఆమె దీక్ష చేపట్టి నాంపల్లి గుట్ట మీద ఉన్న లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకుంటుంది. దీంతో ఆమెకు సంతానం కలుగుతుంది. ఈ విషయాన్ని రాజైన తన భర్తకు చెబుతుంది. వెంటనే ఆ ఆలయాన్ని నరేంద్రుడు ప్రత్యేకంగా అభివృద్ధి చేశాడని చెబుతుంటారు' అని భక్తులు చెబుతుంటారు.

**నాగమణి అనే భారీ పాము**

నాంపల్లి గుట్ట మీద భారీ పాము ఆకారంలో ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. కింద నుంచి చూస్తే ఆ పాము ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆ పాము బొడ్డు ద్వారా దానిలోపల సొరంగం మాదిరిగా అందులో నుంచి వెళ్లేవిధంగా దానిని నిర్మించారు. భక్తప్రహ్లాదుడు, హిరణ్యకిశపుడి కథను తెలిపే ప్రత్యేక విగ్రహాలు ఆ పాము లోపల ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సొరంగం చివరన, రాక్షసుడు హిరణ్య కిశపుడిని సంహరించిన నరసింహుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఈ విగ్రహాలను చిన్నపిల్లను ఎంతో ఆకర్శిస్తుంటాయి.

**నల్ల, తెల్ల రాళ్లు**


పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే నరసింహాస్వామి ఆలయం ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. పచ్చని కొండల నడుమ భారీ గుట్ట, ఆ గుట్టలో ప్రత్యేకమైన నల్లని, తెల్లని రాళ్లు ఉంటాయి. నీటి చెలిమలూ ఉంటాయి. నీటి ప్రవాహం కూడా కనిపిస్తుంటుంది. ఆ నీటి ప్రవాహం చేస్తున్న శబ్ధంగా అద్భుతంగా వినిపిస్తుంటుంది.

**ఎలా చేరుకోవాలి..?**


ఈ ఆలయం వేములవాడ కరీంనగర్ హైవేపై ఉంటుంది. హైదరాబాద్ నుంచి 150 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంటుంది. రోడ్డు మార్గం గుండా హైదరాబాద్ నుంచి నాంపల్లి గుట్టకు వచ్చేందుకు 3 గంటలకు పైగా సమయం పడుతుంది. రాష్ట్రంలోని కరీంనగర్, సిద్ధిపేట, వరంగల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాలతోపాటు పలు ప్రాంతాలకు సిరిసిల్ల నుంచి వెళ్లే బస్సుల్లోకి ఎక్కితే నాంపల్లికి చేరుకోవొచ్చు. ఆ గ్రామంలో ఉండే ఆటోలు, చిన్న చిన్న వాహనాల ద్వారా గుట్టకు చేరుకోవొచ్చు. నాంపల్లి బస్టాండ్ నుండి ఈ ఆలయం 2 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. వేములవాడ బస్టాండ్ నుండి 4.5 కి.మీ, వేములవాడ ఆలయానికి 3 కి.మీ మరియు కరీంనగర్ నుండి 32 కి.మీ దూరంలో ఈ ఆలయం ఉంటుంది.

**భక్తుల డిమాండ్...**

నాంపల్లి గుట్టలోని నరసింహా ఆలయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం మరింతగా అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు. రాష్ట్రంలో ఉన్న యాదాద్రి, వేములవాడ, కొండగట్టు తరహాలో ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో నాంపల్లి గుట్ట మరింతగా ప్రసిద్ధి చెందుతుందంటూ భక్తులు ఆకాంక్షిస్తున్నారు.







# వేగంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన

### ఫిర్యాదుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్.. రెవెన్యూ, శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా :** ఇందిరమ్మ లబ్ధిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్లు గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తీసుకురావడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే indirammaindlu.telangana.gov.in కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ఎప్పటికప్పుడు తీసుకున్న చర్యల వివరాలు ఫిర్యాదుదారుని మొబైల్ కు మెసేజ్ ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

గ్రామాల్లో ఎంపీడీవో, పట్టణాల్లో మున్సిపల్ కమీషనర్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదు వెళ్తుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది,ఎలాంటి మధ్యవర్తులకు తావులేకుండా అర్హులైన వారికే ఇండ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటుంది. వీలైనంత త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ఈనెల 8వ తేదీనాటికి హైదరాబాద్ మినహా 32 జిల్లాలలో 95 శాతం పూర్తికాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88 శాతం పూర్తయింది. త్వరలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి ఇండ్ల నిర్మాణానికి చేపట్టవలసిన కార్యాచరణపై దృష్టి సారించాలని అలాగే అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదటి విడతలో నివాసస్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇస్తామని, రెండవ దశలో ప్రభుత్వమే నివాస స్థలంతోపాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని అన్నారు. మొదటి విడతలో వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాధలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కర్మచారులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేదని, ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేసి లబ్ధిదారులే ఇండ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పించాం. లబ్ధిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా ఇండ్లు నిర్మించుకోవచ్చని చివరి లబ్ధిదారుని వరకు ఇండ్ల మంజూరు చేసి నిర్మించే బాధ్యత ఈ ఇందిరమ్మ ప్రభుత్వానిదేనని ఆయన మరోమారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాశ్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు

EDITORIAL ఎడిటోరియల్

# కెనడా అమెరికాలో విలీనమవుతుందా?





కెనడా వైపు ఇపుడు ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా చేసుకుంటామని, కెనడా ప్రజల బాగుకోసం అదొక్కటే మార్గమని ట్రంప్ కొత్తవాదన తీసుకొచ్చారు. మాతో కలిస్తేనే మీకు భవితవ్యం అంటూ ఉడికిస్తున్నారు. కెనడా కథ ఇపుడు మారింది. త్వరలో ఎన్నికలకు వెళ్లబోతున్న తరుణంలో ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటించారు. మూడు పర్యాయాలు కెనడాను పాలించిన లిబరల్ పార్టీకి కొత్త నాయకుడు రానున్నారు. పదవి కాపాడుకోడానికి యాంటీఇండియా స్టాండ్ తీసుకున్నప్పటికీ.. ట్రూడో తలరాత మారలేదు. పైగా.. గోతికాడ నక్కలా యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ కాచుకొని కూర్చున్నారు. కెనడాను యూఎస్‌లో 51వ స్టేట్‌గా చేసుకుంటానని ఆఫర్ ఇచ్చారు. మాతో కలవకపోతే కెనడాకు భవిష్యత్తే లేదని హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో భారత్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కథ అడ్డం తిరిగింది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుండి కూడా వైదొలగుతున్నట్లు తెలిపారు. ఇక, పార్టీకి తదుపరి నాయకుడిని ఎంపిక చేసుకునే వరకూ ప్రధాని పదవిలో కొనసాగుతానని వెల్లడించారు. ఇక పార్టీ పదవితోపాటు ప్రధాని బాధ్యతలు చేపట్టడానికి లిబరల్ పార్టీలో ప్రక్రియ ప్రారంభమైంది. 'కొత్త నేతను పార్టీ ఎన్నుకున్న తర్వాత పార్టీ అధ్యక్ష పదవితో పాటు, ప్రధాని పదవికి రాజీనామా చేయాలని అనుకుంటున్నట్లు.. జనవరి 6న మీడియా సమావేశంలో ట్రూడో పేర్కొన్నారు. అంతేకాదు కొత్త నేతను ఎన్నుకునేదాకా కెనడా పార్లమెంటును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, మార్చి 24వ తేదీ వరకూ పార్లమెంట్ స్థంభన కొనసాగనుంది. "తన కుటుంబంతో విస్తృతంగా చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు" చెప్పారు. ట్రూడో 2013 నుండి లిబరల్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. 2015 నుండి ప్రధానమంత్రిగా ఉన్నారు. కాగా, ఈ రాజీనామా ట్రూడో సుదీర్ఘ పదవీకాలం తర్వాత ఆయనపై వచ్చిన వ్యతిరేకతకు అద్దం పడుతుంది. 53 ఏళ్ల ట్రూడో పాలనపై కొంత కాలంగా కెనడా వాసుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ట్రూడో రాజకీయ ప్రయాణంలో కూడా తీవ్రమైన ఆటుపోట్లు ఎదురయ్యాయి. రాజీనామా చేయాలని సొంత పార్టీ ఎంపీల నుంచి గత కొన్ని నెలలుగా తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. 2015లో ప్రధానిగా పగ్గాలు చేపట్టిన ట్రూడో ఇటీవలి కాలంలో దేశీయంగా, అంతర్జాతీయంగా అపఖ్యాతి పాలయ్యారు. ఖలిస్థానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత ఏజెంట్ల పాత్ర ఉందని నిరాధార ఆరోపణలు చేసిన తర్వాత.. ట్రూడో గ్రాఫ్ మరింత దిగజారింది. దీంతో భారత్, కెనడా ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనిపై సొంత పార్టీలోనే గాక.. అటు ప్రతిపక్షం నుండి కూడా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్నారు. ఇక, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గిన ట్రంప్ కూడా ట్రూడో రాజీనామాపై ఒత్తిడి తెచ్చారనే చెప్పాలి. ట్రూడోతో ఎప్పుడూ సత్సంబంధాలు లేని ట్రంప్, తన మొదటి పాలనా కాలం నుండి కూడా ట్రూడో పాలనపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. డ్రగ్స్, అక్రమ వలసలను కెనడా కట్టడి చేయకపోతే, ఆ దేశంపై 25 శాతం పన్ను విధిస్తామని హెచ్చరించారు. దీంతో జస్టిన్ ట్రూడోపై ఒత్తిడి మరింత పెరిగింది. ఇటీవల ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి పదవికి రాజీనామా చేసిన క్రిస్టియా ఫ్రీలాండ్ కూడా ప్రధాని ట్రూడో ఆర్థిక విధానాలను తీవ్రంగా తప్పుబట్టారు. ఇటీవల జరిగిన సర్వేల్లోనూ ట్రూడోకు ఉన్న జనాదరణ భారీగా తగ్గిపోయింది. ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీ వైపు 47 శాతం ప్రజలు మొగ్గు చూపితే, కేవలం 21 శాతం మంది మాత్రమే లిబరల్ పార్టీకి అనుకూలంగా ఉన్నారు. అలాగే, ఇటీవలి నెలల్లో, ట్రూడోకు ఆమోదం రేటింగ్‌లు క్షీణించాయి. ట్రూడో వివిధ విధాన నిర్ణయాలపై విమర్శలు పెరిగాయి. ముఖ్యంగా, వాతావరణ మార్పుతో పాటు ట్రూడో ఆర్థిక వ్యూహాలు... పార్టీ సభ్యులను, నియోజకవర్గాలను దూరం చేసాయి. ఇక, ట్రూడో పదవీ కాలంలో రాజకీయ కుంభకోణాలు కూడా రాజీనామాలో కీలక పాత్ర పోషించాయి. ఛారిటీ సభల్లో మాట్లాడటానికి ఆర్థిక ప్రయోజనాలను పొందారనే ఆరోపణలతో ట్రూడో నిజాయితీపై మచ్చ పడింది. దీనికి తోడు, దేశం ఆర్థిక సమస్యలతో నలిగిపోయింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తీవ్రమైన గృహ సంక్షోభం, పెరుగుతున్న జాతీయ రుణం.. అన్నీ కలిసి ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. మరోవైపు స్వదేశీ సంబంధాల్లోనూ ట్రూడో విఫలం అయ్యారు. స్వదేశీ కమ్యూనిటీలతో సయోధ్య గురించి ప్రసంగాలు చేసినప్పటికీ.. ట్రూడో చర్యలు మాత్రం దానికి తగ్గట్లు కనిపించలేదు. తన పదవి కాపాడుకోడానికి, భారత వ్యతిరేక ఖలిస్తానీ తీవ్రవాద శక్తులను బుజ్జగించడం నుండి.. ఓట్ల కోసం దేనికైనా రెడీ అనేట్లు ట్రూడో వ్యవహరించారు. ట్రూడో ప్రచారం చేసుకున్న ప్రగతిశీల రూపం మసకబారింది. దేశంలో సాధారణ ప్రజానీకం నుండి డిస్‌కనెక్ట్ అయ్యారనే భావన అందరిలోనూ పెరిగింది. ఇక, ట్రూడోపై నానాటికీ పెరుగుతూ వచ్చిన వ్యతిరేకత వల్ల... అంతర్గతంగా పార్టీ నుండి ఒత్తిడి పెరిగింది. బహిరంగంగా, ప్రైవేట్‌గా చాలా మంది లిబరల్ ఎంపీలు.. ట్రూడోను రాజీనామా చేయాలని కోరారు. నాయకత్వ మార్పు కోసం పిలుపునిచ్చారు. అలాగే, పోల్ సంఖ్యలు కూడా ట్రూడోకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఇటీవలి ఎన్నికల్లో ప్రతిపక్ష పియరీ పోయిలీవ్రే నేతృత్వంలోని కన్జర్వేటివ్‌ల కంటే అధికార లిబరల్ పార్టీ వెనుకబడింది. మరోవైపు, కెనడా ప్రపంచవ్యాప్తంగా ఒంటరి అయ్యింది. ముఖ్యంగా, భారత్, చైనాతో కెనడా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కెనడా దౌత్యపరంగా బలహీనంగా మారింది. అంతర్జాతీయంగా అనిశ్చితి పెరిగింది. అటు అమెరికా నుండి ట్రంప్ కూడా ట్రూడోపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఒక దేశ ప్రధానిలా కాకుండా.. యూఎస్‌లోని ఒక రాష్ట్రానికి గవర్నర్ అనే ధోరణిలో ట్రూడోను పేర్కొన్నారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద దేశమైన కెనడా ప్రధానిని ట్రంప్ అలా వ్యవహరించడం ట్రూడో చేతగాని తననానికి నిదర్శనంగా నిలిచింది. ప్రతిపక్ష పార్టీలతో పాటు కెనడా ప్రజలు కూడా దాన్ని జీర్ణించుకోలేకపోయారు. అందుకే.. తన రాజీనామా ప్రకటనలో ట్రూడో ఒక కీలక వ్యాఖ్య చేశారు. "దేశ అంతర్గత పోరాటాల్లో తాను ఉత్తమ ఎంపిక కాదని స్పష్టం అయ్యిందనీ.. కాబట్టి, వచ్చే ఎన్నికల్లో కెనడా ప్రజలు నిజమైనదాన్ని ఎంచుకోవాలని కోరారు. ప్రస్తుతం కెనడా కథ మారిందనే చెప్పాలి. అయితే, కొన్ని రోజుల్లో అమెరికా గద్దెనెక్కుతున్న ట్రంప్ కెనడాను యూఎస్‌లో కలుపుకుంటారా లేదో చూడాలి. అలాగే, భారత్‌తో కెనడా సంబంధాలు మెరుగుపడతాయా లేదా అనేది కూడా తేలాల్సి ఉంది. ఆ మధ్య ఓ ఎక్స్ యూజర్.. ఎలన్ మస్క్‌ను ఉద్దేశిస్తూ.. కెనడాలో ట్రూడో బాధ పోవడానికి మీ హెల్ప్ కావాలని ఒక పోస్ట్ పెట్టారు. దీనికి మస్క్ స్పందిస్తూ.. "హీ విల్ బి గాన్ ఇన్ ది అప్‌కమింగ్ ఎలక్షన్" అంటూ రిప్లై ఇచ్చారు. దీనితో ఈ పోస్ట్‌పై తీవ్రమైన చర్చ నెలకొంది. కొంతమంది యూజర్లు, రాబోయే ఎన్నికల వరకూ ఆగలేము.. ఈ లోపే ఏదైనా చెయ్యండంటూ కామెంట్లు పెట్టారు. అనుకున్నట్లే.. ఎన్నికల కంటే ముందే ట్రూడో మిడిల్ డ్రాప్ అయ్యారు. ఇక, "2025 ఈజ్ లుకింగ్ గుడ్" అంటూ తనదైన శైలిలో సెటైర్ పేల్చారు.

### కెనడాను అమెరికాలో విలీనం చేసుకుంటానన్న ట్రంప్

ఇక, ఇప్పుడు అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కెనడా ఉన్న పరిస్థితులను వాడుకోవాలని చూస్తున్నారు. ఈ సమయంలో కెనడాకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. కెనడాను అమెరికాలో విలీనం చేసుకుంటానని చెప్పారు. యునైటెడ్ స్టేట్స్‌లో కెనడా 51వ రాష్ట్రంగా చేరాలనే ప్రతిపాదనను ట్రంప్ మరోసారి గుర్తుచేశారు. ఈ మేరకు, ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో దీనిపై సంచలన పోస్ట్ పెట్టారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండటం కెనడాలోని మెజార్టీ ప్రజలు కోరుకుంటున్నారనీ.. ఆ దేశానికి అధిక రాయితీలు ఇచ్చి, అమెరికా నష్టపోవాల్సిన అవసరం లేదని..' అందులో పేర్కొన్నారు. అలాగే, 'కెనడా ప్రధాని ట్రూడోకు ఈ విషయం తెలుసు కాబట్టే ఆయన రాజీనామా చేసినట్లు' వెల్లడించారు. 'ఇప్పుడు కెనడా అమెరికాలో విలీనమైతే దిగుమతి సుంకాలు ఉండవనీ.. పన్నులు తగ్గుతాయనీ.. అంతేగాక, రష్యా, చైనాలకు చెందిన నౌకల నుంచి ఎలాంటి ముప్పు కూడా ఉండదు' అని ట్రంప్ హామీ ఇచ్చారు. 'రెండు దేశాలూ కలిస్తే... అత్యంత గొప్పదేశంగా యూఎస్ నిలబడుతుందని' ట్రంప్ అభిప్రాయపడ్డారు. నిజానికి, 20172021 వరకు అమెరికా అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్ మొదటి పదవీకాలంలో కూడా ట్రూడోట్రంప్ మధ్య మంచి సంబంధాలు లేవు. 2024 డిసెంబరులో కూడా.. యూఎస్ సబ్సిడీలు కెనడాకు కావాలని అనుకుంటే.. అమెరికాలో భాగం కావాలని ట్రంప్ అన్నారు. కెనడా తమ భూభాగాల గుండా అక్రమ వలసదారుల ప్రవాహాన్ని అరికట్టకపోతే... భారీ సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. అయితే, దీనిపై ట్రూడో ఆశించినంత స్పందించలేదు. ట్రంప్ మాటలకు కెనడా ఉప ప్రధాని, ఆర్థిక శాఖ మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి ప్రధాని ట్రూడో వ్యవహార శైలి కారణమంటూ విమర్శించి, తన పదవికి క్రిస్టియా రాజీనామా చేశారు. కన్జర్వేటివ్‌లు అధికారంలోకి వస్తే, ట్రూడో ఆధ్వర్యంలో బలహీనంగా మారిన దేశాన్ని బలమైన దేశంగా మారుస్తామని అన్నారు. బలవంతంగానైనా అమెరికాతో చర్చలకు వెళ్తామని చెప్పారు. "కెనడా ఎప్పటికీ స్వతంత్రంగా ఉంటుంది" అని అన్నారు.

### సంబంధాలు మెరుగవుతాయా?

ట్రూడో రాజీనామాతో కెనడాభారత్ సంబంధాలు తిరిగి మెరుగుపడే అవకాశం ఉంది. రెండు దేశాల మధ్య మరింత నిర్మాణాత్మకమైన బంధం ఏర్పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కెనడాలో నాయకత్వ మార్పిడి దెబ్బతిన్న దౌత్య సంబంధాలను కొత్త పుంతలు తొక్కిస్తుందని ఆశిస్తున్నారు. ముఖ్యంగా, ట్రూడో నాయకత్వంలో... కొంత మేర, కెనడాభారత్ మధ్య వాణిజ్యం వృద్ధి కనిపించింది. మార్చి 2024 నాటికి ఇది సుమారు $8.4 బిలియన్లకు చేరుకుంది. 2023 నుండి కొనసాగుతున్న ఉద్రిక్తతలు రెండు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలకు కారణం అయ్యింది. దీనితో సహా భవిష్యత్ చర్చలను కూడా ఇది ప్రభావితం చేసింది. కాబట్టి, రాబోయే కొత్త నాయకత్వంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది. కెనడాలో చదువుతున్న భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపే ట్రూడో అంతర్జాతీయ విద్యార్థుల అనుమతి విధానం కూడా మారే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం కెనడాలో ఉన్న సుమారు 4 లక్షల 27 వేల మంది భారతీయ విద్యార్థులు, కొత్త ప్రభుత్వంలో ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పులను ఆశిస్తున్నారు. ట్రూడో రాజీనామాతో కెనడా రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలయ్యింది. పదేళ్ల తర్వాత... సమూలంగా మారిన కెనడా పాలనా విధానాన్ని రాబోయే రోజుల్లో ప్రపంచం చూడబోతోంది. కెనడా స్వతంత్రంగా ఉంటూ పొరుగుదేశాలతో సంబంధాలు మెరుగుపరుచుకుంటుందా? లేక అమెరికాలో విలీనమవుతుందా? ఎప్పటిలాగే తన దుందుడుకు విధానాలతో ముందుకు వెళుతుందా? అన్నదానిని ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది.

# పుణ్యక్షేత్రంలో మృత్యుపాశం

**ఏడుకొండలపై ఎన్నడూ కనని.. వినని విషాదం. కొండపై ఈ విషాదం ఎలా జరిగింది? ఈ పాపానికి కారకులెవరు? జరిగిన నష్టానికి బాధ్యులెవరు? దేశవ్యాప్తంగానే కాదు.. ప్రపంచంలోని భారతీయ హిందువులందరికీ ఎంతో ఆరాధ్యుడైన వెంకన్న సన్నిధిలో నిర్లక్ష్యం జరిగింది. బాధ్యులు చేతులెత్తేశారు. మోక్షం కోసం వచ్చిన సామాన్యులు సమిధలయ్యారు. ప్రశాంతతకోసమో, పుణ్యంకోసమో వెళ్లినవారు అక్కడే ప్రాణాలు వదలాల్సి వస్తుందని వారు ఊహించలేదు. ఒకరి నిర్లక్ష్యానికో కొందరి తొందరపాటుకో నిండు ప్రాణాలు బలయ్యాయి. ఏడుకొండలపై తొలిసారి ఇలాంటి ఘటన. ఒక్కసారిగా తొక్కిసలాట. అందరినీ అదుపుచేసేసరికే పెనువిషాదం జరిగిపోయింది. ఇంత ఘోరం ఎలా జరిగింది? ఈ నిర్లక్ష్యానికి కారకులెవరు? అనుకోకుండా జరిగిన విషాదమా? ఏదన్నా కుట్ర ఉందా? తిరుపతి విషాదం వెనుక వైఫల్యాలపై మహాప్రత్యేక కథనం..**

**- మహా ప్రత్యేకం**

### కొండపై ఘోరం ఎలా జరిగింది?



తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎన్ని గంటలపాటైనా క్యూలైన్లలో నిలుచుని వెంకన్న దర్శనం చేసుకుంటారు భక్తులు. దశాబ్దాలుగా ఏడుకొండలవాడి సన్నిధిలో రద్దీ మామూలే. చిన్నచిన్న అసౌకర్యాలు, అప్పుడప్పుడూ భక్తుల ఫిర్యాదులే తప్ప, టెంపుల్ సిటీలో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదు. సడెన్‌గా గేటు తెరవడమే తోపులాటకు కారణమంటున్నా.. అధికార యంత్రాంగం వైఫల్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. బుధవారం రాత్రి 8:20 నిమిషాల ప్రాంతంలో క్యూలైన్‌లో శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడుతున్న మహిళను బయటికి రప్పించే క్రమంలోనే తొక్కిసలాట జరిగిందంటున్నారు స్థానిక అధికారులు. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల కోసం తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ దగ్గర జరిగిందీ దారుణం. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం విస్తృత ఏర్పాట్లు చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లు జారీ చేయాలని తొలుత నిర్ణయించారు. అయితే బుధవారం మధ్యాహ్నం నుంచే భక్తుల తాకిడి మొదలైంది. కేంద్రాల బయట నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి. బైరాగిపట్టెడ దగ్గర తాకిడి తక్కువగా ఉంటుందని భావించిన యాత్రికులు బుధవారం ఉదయం పదింటికే అక్కడికి చేరుకున్నారు. రాత్రికల్లా పరిసరాలన్నీ కిక్కిరిశాయి. రద్దీలో ఇరుక్కుపోయిన భక్తులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. మహిళలు నిస్సహాయంగా చిక్కుకుపోయారు. క్యూలైన్లలోకి వెళ్లేందుకు జరిగిన తోపులాటలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురిలో ఐదుగురు మహిళలే. తొక్కిసలాటలో గాయపడ్డ భక్తులను స్విమ్స్, రుయా ఆస్పత్రులకు తరలించారు. తిరుపతిలోని పలు టోకెన్ల జారీ కేంద్రాల దగ్గర రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను అనుమతించారు. బైరాగిపట్టెడలో అందుకు భిన్నంగా వ్యవహరించడమే తొక్కిసలాటకు కారణమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

**అంచనా వేయలేకపోయారా?**

భక్తుల రద్దీని అధికారులు అంచనా వేయలేకపోయారా? తోపులాట ప్రాణాలు తీసేదాకా వస్తుందని ఊహించలేకపోయారా? ఆరుగురు మరణానికి, 41మంది ఆస్పత్రి పాలుకావడానికి కారణమేంటన్న పోస్టుమార్టం మొదలైంది. సీఎం చంద్రబాబుకు ఇప్పటికే ప్రాథమిక నివేదిక వెళ్లింది. ఎందుకంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులను మొహంమీదే కడిగేసిన సీఎం.. చర్యలు ప్రారంభించారు. సమీక్షా సమావేశంలోనూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి డీఎస్పీతో పాటు గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిని సస్పెండ్ చేసింది ప్రభుత్వం. ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ని బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. తొక్కిసలాట ఘటనపై జుడీషియల్ విచారణకు ఆదేశించిన సీఎం.. నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలుంటాయని ప్రకటించారు. తిరుపతిలో దర్శనం టికెట్లు ఇవ్వడం గతంలోలేని సంప్రదాయమన్న చంద్రబాబు.. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ పద్ధతులు ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావటంతో తిరుపతి తొక్కిసలాట ఘటన దేశమంతా చర్చనీయాంశమైంది.

**భగ్గుమన్న సీఎం**

తిరుపతిలో తొక్కిసలాట ఘటనతో అధికారులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. బాధ్యత తీసుకున్నవారు విధుల్ని సజావుగా నిర్వర్తించాలని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ ఈవో, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులపై చంద్రబాబు ఫైర్ అయ్యారు. 2 వేల మందికే చోటు ఉన్నప్పుడు.. 2,500 మందిని ఎందుకు పంపాల్సి వచ్చిందని ప్రశ్నించారు. తిరుపతి, తిరుమలలో అన్ని కౌంటర్ల దగ్గర ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామంటోంది అధికార యంత్రాంగం. గేటు తెరిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తీసుకోకపోవడమే ఈ దుర్ఘటనకు దారితీసినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేయకపోవడం ఓ తప్పయితే.. డీఎస్పీ గేటు తీయడంతో అంతా ఒక్కసారిగా తోసుకుంటూ వచ్చారన్న వాదన వినిపిస్తోంది. కొందరు భక్తుల అత్యుత్సాహం తొక్కిసలాటకు దారితీసింది. కౌంటర్ దగ్గర గేట్ తెరిచే విషయంలో మిస్ కమ్యూనికేషన్ ఏర్పడిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. భక్తుల్లో అనారోగ్యానికి గురైన ఒకరిని ఆసుపత్రికి తరలించడానికి గేట్ తెరవాల్సి వచ్చిందని, మళ్లీ వెంటనే మూసేసినా ఆలోపే టోకెన్లు జారీ చేస్తున్నారని భావించి భక్తులు దూసుకొచ్చారని చెప్పారు. దీంతో అనివార్యంగా గేట్ తెరవాల్సి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. క్యూలైన్లలోకి అంత అనాలోచితంగా ఒకేసారి ఎలా వదిలారు? సీఎంతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా ఇదే విషయంపై సీరియస్ అయ్యారు. తొక్కిసలాట జరిగిన బైరాగిపట్టెడలోని పద్మావతి పార్క్‌ని పవన్‌కల్యాణ్ పరిశీలించారు. భక్తులను క్యూలైన్లలోకి ఒకేసారి ఎందుకు వదిలారని ప్రశ్నించారు. స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పవన్ కల్యాణ్ పరామర్శించారు.

**దేశమంతా చర్చ**

తిరుపతి తొక్కిసలాట ఘటన దేశమంతా చర్చనీయాంశమైంది. దేశంలో ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో గతంలోనూ ఎన్నో తొక్కిసలాట ఘటనలు జరిగాయి. వదంతులు, భయాలు, కొందరి తొందరపాటు చర్యలతో ఎన్నో ప్రాణాలు గాల్లో కలిశాయి. పోయినేడాది జూలై 2న ఉత్తరప్రదేశ్ హథ్రాస్‌లో జరిగిన తొక్కిసలాటలో ఏకంగా 122 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో భారీ జనసందోహంతో జరిగిన భోలే బాబా సత్సంగ్‌లో జరిగిందీ దారుణం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు, పిల్లలే. ఈ తొక్కిసలాటలో 300 మందికి పైనే గాయపడ్డారు. ఏళ్లు గడిచినా మరిచిపోలేని విషాదాలు దశాబ్దాలుగా చరిత్ర పుటల్లో నిక్షిప్తమయ్యాయి. 2005 జనవరి 25 మహారాష్ట్ర సతారా మంధర్‌దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఏకంగా 350మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. టెంకాయలు కొట్టిన మెట్లపై కొందరు భక్తులు జారిపడటంతో మొదలైన తొక్కిసలాట తీవ్ర విషాదానికి దారితీసింది. 2008 సెప్టెంబరు 30న రాజస్థాన్‌లోని జోథ్‌పూర్ చాముండేశ్వరిదేవి ఆలయం దగ్గర జరిగిన తొక్కిసలాటలో 224 మంది ప్రాణాలు గాల్లో కలిశాయి. బాంబు ఉందనే వదంతి ఈ విషాదానికి కారణమైంది. అదే ఏడాది హిమాచల్‌ప్రదేశ్ నైనాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాట 162 నిండుప్రాణాలను బలి తీసుకుంది. కొండచరియలు విరిగిపడుతున్నాయనే ప్రచారంతో భయాందోళనకు గురికావటంతో జరిగిందీ దారుణం. 2023 మార్చి 31న ఇండోర్‌లోని ఒక ఆలయంలో పూజలు జరుగుతుండగా స్లాబ్ కూలిపోవడంతో 36 మంది ప్రాణాలు గాల్లో కలిశాయి. ఇలా చెప్పుకుంటూ పోతే దేశంలో ఎన్నో పుణ్యక్షేత్రాల్లో ఇలాంటి విషాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. వేలమంది యాత్రికులొచ్చే పుష్కరాల్లోనూ తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకున్నాయి. 2015 జూలై 14న రాజమండ్రిలో గోదావరి పుష్కరాల ప్రారంభరోజునే తొక్కిసలాటలో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు తిరుపతిలో తొక్కిసలాటతో మళ్లీ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా సీరియస్ యాక్షన్‌కి దిగింది ప్రభుత్వం. పైగా తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం కావటంతో భక్తుల రద్దీ పెరుగుతోంది. అందుకే ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా కొండపై దర్శనాలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి శ్రీవారి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అనుకున్నప్పటికీ టికెట్ల దశలోనే ఇంత రద్దీ ఉంటుందని అంచనా వేయలేకపోయారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుంటే సకల పాపాలు పోతాయని భక్తుల నమ్మకం. అందుకే తిరుమలకు ఇంతగా రద్దీ పెరిగింది. పుణ్యక్షేత్రాల్లో ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తిరుపతి ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. టెక్నాలజీ ఎంతో పెరుగుతున్న సందర్భాల్లో తొక్కిసలాటలు జరగడం పెను విషాదం. సాంకేతికతకే ఇది సవాల్.

### బాబుదే బాధ్యత

**తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ప్రతిపక్ష వైసీపీ మండిపడింది. గతంలో కూడా చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే పుష్కరాల్లో తొక్కిసలాట జరిగిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. టీటీడీ చరిత్రలోనే ఎప్పుడూ లేని విషాదానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇవి ప్రభుత్వ హత్యలేనని, సీఎం, టీటీడీ ఛైర్మన్ సహా అందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేసింది విపక్షపార్టీ. తిరుమల ప్రసాదాన్ని కూడా రాజకీయం చేయాలని చూసిన ప్రభుత్వం తొక్కిసలాట ఘటనకు ఏం సమాధానం చెబుతుందని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలదీశారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. తిరుపతి ఘటనకు చంద్రబాబుదే పూర్తి బాధ్యత అన్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రముఖులు ఈ ఘటనపై విచారం వ్యక్తంచేశారు.**

### రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# తిరుపతి ఘటన బాధాకరం

**ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి: వైఎస్ షర్మిల**

**ఏపీ:** తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతిచెందడం బాధాకరమని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా(ఎక్స్)లో పోస్ట్ పెట్టారు. గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట ఘోరమైన మృత్యుఘోష ఆర్తనాదాలు వినిపించాయంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలన యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనపై వెంటనే అత్యున్నత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నైతిక బాధ్యత వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం కాదు.. ఒక్కో కుటుం



బానికి కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

# తిరుపతి ఘటనలో ఇద్దరు అధికారులు సస్పెండ్

**మరో ముగ్గురని బదిలీ చేశాం.. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం.. ఏపీ సీఎం చంద్రబాబు**

**ఏపీ:** తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించిన వార్త తెలిసి తాను ఎంతో బాధపడ్డానంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇకముందు తిరుపతిలో ఎటువంటి దుర్ఘటనలు చోటు చేసుకోవొద్దని ఓ భక్తుడిగా కోరుకుంటాన్నారు. గురువారం టీటీడీ పరిపాలనా భవనంలో చైర్మన్, అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'తిరుపతిలో తొక్కిసలాట ఘటన చోటు చేసుకోవడం బాధాకరం. ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించాను. అదేవిధంగా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సైతం పరామర్శించాను. తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బారెడ్డి, టీటీడీ ఏఈఓ గౌతమి, టీటీడీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర్ లు బదిలీ చేశాం. ఘటనపై పూర్తి స్థాయిలో న్యాయ విచారణ జరిపిస్తాం.

మృతుల కుటుంబాలకు టీటీడీ ద్వారా రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. అదేవిధంగా మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్ట్



ఉద్యోగం ఇస్తామంటూ హామీ ఇస్తున్నా. క్షతగాత్రులు తిమ్మక్క, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారి వురికీ రూ. 5 లక్షల చొప్పున సాయం అందిస్తాం. అదేవిధంగా గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున పరిహారం ఇస్తాం. ఆసుపత్రిలో వారిని పరామర్శించినప్పుడు తొక్కిసలాటలో గాయపడిన చికిత్స పొందుతున్నమన్న బాధలో ఉన్నప్పటికీ వారికి స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో కనిపించింది. ఈ నేపథ్యంలోనే ఆ 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తాం. టీటీడీ పవిత్రతను కాపాడే బాధ్యతను తీసుకుంటా. తెలిసీ తెలియక మనం చేసిన పనుల వల్ల దేవుడి పవిత్రత దెబ్బతినే పరిస్థితి వస్తే మంచిది కాదు. మన అసమర్థత కారణంగా దేవుడికి చెడ్డపేరు రాకూడదు.

తిరుపతిలో రాజకీయాలు చేయకూడదు. రాజకీయాలకు అతీతంగా దేవుడికి సేవ చేస్తున్నామనే భావనతో ముందుకువెళ్లాలి. వెకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవాలని భక్తులు కోరుకుంటారు. స్వామివారి దర్శనం కోసం తిరుమల కొండపై 36 గంటలైనా క్యూలైన్లలోనే వేచి ఉంటారు. కానీ, గతంలో లేని విధంగా ఈసారి వైకుంఠ ద్వార దర్శనాన్ని పదిరోజులకు పెంచారు. టికెట్లు జారీ చేయడం.. ఇవ్వన్నీ కూడా గతంలో లేని సంప్రదాయాలు. ఆది నుంచి ఉన్న సంప్రదాయాలను మార్చడం సరికాదు. ఆగమ శాస్త్రం ప్రకారమే ఆలయ సంప్రదాయాలు కొనసాగాలి. ఇక ముందు ఏ ఆలయంలోనూ అపచారం జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఆలయాల్లో భక్తులకు దర్శనాల్లో ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే' అంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# తిరుపతి ఘటనపై పవన్ ఏం సమాధానం చెబుతారు..?

- **ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట జరిగింది**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**
- **మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**ఏపీ:** తిరుపతి ఘటనపై మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యం వల్లే తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా తిరుపతిలో ఘోర ప్రమాదం జరిగింది. తొక్కిసలాట జరిగి ఆరుగురు చనిపోవడం అత్యంత బాధాకరం. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. తిరుమల కొండపై వివాదాలు సృష్టించి, రాజకీయంగా వైసీపీని అణచివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భక్తులకు సేవ చేయాలనే దృక్పథం వారికి లేదు. వైకుంఠ ఏకాదరి ఏర్పాట్లపై కిందిస్థాయి సిబ్బంది సూచనలు ఎందుకు తీసుకోలేదు. కేవలం అధికారుల తప్పిదం, మానవ



లోపంతోనే ఈ తొక్కిసలాట జరిగింది. చైర్మన్ బీఆర్ నాయుడికి దేవుడి మీద భక్తి లేదు. ఆయన కేవలం వైసీపీ పై విషం చిమ్మటమే పనిగా పెట్టుకున్నారు. కొండ మీద రాజకీయాలు చేసి జగన్‌ను అడ్డుకునే ప్రయత్నాలే చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడే యోధుడిగా చెప్పుకుంటున్న పవన్ కల్యాణ్ ఈ ఘటనపై ఏం సమాధానం చెప్తారు?' అంటూ అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు.



# చౌకగా బంగారం

**పసిడి ప్రియులకు నిర్మలమ్మ తీపికబురు**

**మహా:** వచ్చేనెల ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన కీలక విషయాలు వైరల్ అవుతున్నాయి. ఈ బడ్జెట్లో ఫోకస్ కాబోయే అంశాలు, ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలపై చర్చ నడుస్తోంది. దీనిలో భాగంగానే బంగారం పై మూడు శాతం జీఎస్టీని ఒకటి శాతానికి తగ్గించాలని గోల్డ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బడ్జెట్ తర్వాత బంగారు నగలు మరింత చౌకగా మారే ఛాన్స్ ఉందంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుందన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. బంగారంపై జీఎస్టీని తగ్గించడం ద్వారా భారీ ప్రయోజనం చేకూర్చాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఆదాయ సమాన నిష్పత్తిని ఒక శాతానికి తగ్గించాలని పరిశ్రమలో డిమాండ్ ఉంది. ఇది జరిగితే బంగారం కొనుగోలుదారులు పెద్ద ప్రయోజనాలను పొందవచ్చు.





# చంద్రబాబుదే బాధ్యత

**భగ్గుమన్న వైయస్ జగన్ ■ తొక్కిసలాట బాధితులకు పరామర్శ**

**■ చంద్రబాబు సీఎం అయ్యాక టీటీడీ ప్రతిష్ట దెబ్బ తింటోంది ■ ఈ ఘటన ప్రభుత్వ తప్పిదమే**

**ఏపీ, మహా:** చంద్రబాబు సీఎం అయ్యాక టీటీడీ ప్రతిష్ట దెబ్బతింటోందని, తిరుపతి తొక్కిసలాట ఘటనకు పూర్తి ప్రభుత్వాన్నిదేనంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుపతి పద్మావతి మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాతూ కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది కచ్చితంగా ప్రభుత్వ తప్పిదం. సీఎం మొదలు, టీటీడీ అధికారులు, ఛైర్మన్, జిల్లా ఎస్పీ, కలెక్టర్ అందరూ ఈ ఘటనకు బాధ్యులే. అందుకే వారందరిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. తొక్కిసలాటను తక్కువ చేసి చూపుతూ, తప్పుడు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీఎన్ఎస్ 194 సెక్షన్‌కు బదులు బీఎన్ఎస్ 105 సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి. గాయపడినవారికి మంచి వైద్యం అందించడంతోపాటు, డిశ్చార్జ్ సమయంలో కనీసం రూ. 5 లక్షల చొప్పున సాయం అందించాలి. చంద్రబాబుకు దేవుడంటే భక్తి లేదు.. భయం లేదు. అందుకే శ్రీ వెంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదంపైనా ఆరోపణలు చేశారు. దుష్ప్రచారం చేశారు. ఈరోజు కూడా ఆయన వైఖరి వల్లనే ఈ దుర్ఘటన జరిగింది. తిరుపతిలో జరిగిన ఈ ఘటన రాష్ట్ర చరిత్రలోనే లేదు. తొక్కిసలాటకు ఇంతమంది బలి కావడం గతంలో ఎప్పుడూ చూడలేదు. కానీ, ఈరోజు ఇలాంటి పరిస్థితి వచ్చింది.

ఇంత జరిగినా, సీఎం చంద్రబాబు పద్ధతి లేకుండా మాట్లాడారు. ఎఫ్ఐఆర్ కూడా తప్పులతడకగా నమోదు చేశారు. టీటీడీ అనేది ఒక గొప్ప వ్యవస్థ. వైకుంఠ ఏకాదశి రోజున లక్షల మంది వస్తారు. ఆరోజు స్వామి వారిని దర్శిస్తే, మహా పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. అందుకే లక్షల మంది తరలి వస్తారు. ఆ దర్శనం కోసం టోకెన్లు ఇచ్చే కౌంటర్ల వద్ద ఎందుకు సెక్యూరిటీ కల్పించలేదు? ఇది సీఎం చంద్రబాబు సొంత జిల్లా అయినా టీటీడీ బాధ్యతారహితంగా వ్యవహరించింది. దుర్ఘటనలో ఇప్పటికే ఆరుగురు చనిపోయారు. ఉజ్జాయింపు లెక్కల ప్రకారం చూస్తే కనీసం 50 నుంచి 60 మంది గాయపడ్డారు. టీటీడీ అధికారులు మొదలు జిల్లా కలెక్టర్ వరకు అందరూ దీనికి బాధ్యులు. చంద్రబాబు నిర్వాకం వల్ల గతంలో గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాటకు 29 మంది చనిపోయారు. కేవలం ఆయన పబ్లిసిటీ పిచ్చి కోసం అంత మందిని బలి తీసుకున్నారు. నేను ఇక్కడికి వస్తానని, వాస్తవాలు ప్రజలకు చెబుతానని భయపడి నేను ఇక్కడికి రాకుండా అడ్డుకోవాలని చూశారు. నన్ను ట్రాఫిక్‌లో ఆపి, నా కాన్వాయ్ ఆస్పత్రికి రావొద్దన్న కుట్ర చేశారు. చివరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని తరలించాలని చూశారు. వారు ఎదురుతిరగడంతో ఊరుకున్నారు. అప్పటికి కొందరు పేషెంట్లను బలవంతంగా డిశ్చార్జ్ చేశారు' అంటూ జగన్ పేర్కొన్నారు.

# బాబు అధికారంలోకి వచ్చినప్పుడే ఈ ఘటనలు

**తిరుపతిలో గతంలో ఇటువంటివి జరగలే**

**కూటమి ప్రభుత్వంపై కేసు నమోదు చేయాలి: మాజీ మంత్రి రోజా**

**ఏపీ:** తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు చనిపోయారన్నారు. ఇవి ప్రభుత్వం చేసిన హత్యలేనంటూ ఆమె విమర్శించారు. వెంటనే సీఎం, మంత్రులు, పాలకమండలి సభ్యులు తమ పదవులకు రాజీనామాలు చేయాలన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ రోజా డిమాండ్ చేశారు.



గురువారం తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు . 'తిరుపతిలో గతంలో ఇటువంటి దురదృష్ట ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. చంద్రబాబు టీటీడీ చైర్మన్‌గా అసమర్ధుడిని నియామించారు. లక్షలాధి మంది వచ్చే దేవస్థానంలో భద్రతపై చిత్తశుద్ధిలేని వ్యక్తిని ఎస్పీగా పెట్టారు. వీరంతా చంద్రబాబుకు ఊడిగం చేసేందుకే పనిచేస్తున్నారు తప్ప భక్తుల కోసం పనిచేయడంలేదు. బాబు అధికారంలోకి వచ్చినప్పుడల్లా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో జరిగిన తొక్కిసలాట 29 మంది మృతిచెందారు. అదేవిధంగా ఇటీవల విజయవాడలో వరదల వల్ల 60 మంది చనిపోయారు. సనాతన యోధుడని గొప్పగా చెప్పుకున్న పవన్‌కల్యాణ్ తిరుపతి ఘటనపై స్పందించాలి. వెంటనే కూటమి ప్రభుత్వం రాజీనామా చేయాలి. తెలంగాణలో పుష్ప సినిమా బెనిఫిట్ షోలో తొక్కిసలాట జరిగితే హీరో అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లుగానే తిరుపతి ఘటనపై చంద్రబాబు , టీటీడీ పాలక మండలి, అధికారులను బాధ్యులు చేస్తూ క్రిమినల్ కేసులను నమోదు చేయాలి. అదేవిధంగా ఈ ఘటనపై పీఠాధిపతులు సైతం స్పందించి పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ప్రభుత్వ నిర్లక్షాన్ని ఎండగట్టాలి. బీజేపీ నాయకులకు నిజంగా భక్తి మీద శ్రద్ధ ఉంటే తిరుపతి ఘటనపై ప్రధాని మోదీకి ఫిర్యాదు చేయాలి' అంటూ రోజా పేర్కొన్నారు.

# వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాంకు ముందస్తు బెయిల్



**విజయవాడ:** ఏపీ హైకోర్టులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తలసిల రఘురాంకు ఊరట దక్కింది. కూటమి ప్రభుత్వం ఆయనపై నమోదు చేసిన అక్రమ కేసుల్లో ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టులో ఎమ్మెల్సీ తలశిల రఘురాం పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

## సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా గజ్జల సుధీర్ భార్గవరెడ్డి

**గుంటూరు :** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా డా.గజ్జల సుధీర్ భార్గవరెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా డా.గజ్జల సుధీర్ భార్గవరెడ్డి మాట్లాడుతూ..సత్తెనపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతానన్నారు.

# విజయవాడలో ప్రయాణికుల రద్దీ

**కిటకిటలాడుతున్న బస్టాండ్, రైల్వేస్టేషన్**



**హైదరాబాద్, మహా:** విజయవాడ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండుగ కోసం ప్రజలు ఊరేళ్లేందుకు ప్రయాణ ప్రాంగాణాలకు చేరుకోవడంతో అవి ప్రయాణికులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో చాలామంది తమ పిల్లలతో కలిసి సొంతూళ్లలో పండుగను జరుపుకునేందుకు బయలుదేరుతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలు సహా ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారంతా కూడా సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఇలా వచ్చేవారితో ప్రయాణ ప్రాంగణాలు ప్రయాణికులతో నిండుగా కనిపిస్తున్నాయి. రద్దీ పెరుగడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదే విధంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అదనపు బస్సులను నడుపుతున్నారు. ఇటు హైదరాబాద్ నుంచి కూడా తెలంగాణ ప్రభుత్వం అదనపు బస్సులను నడిపిస్తుంది. ఇటు ఏపీ ప్రభుత్వం కూడా బస్సుల సంఖ్యను మరింతగా పెంచింది. సంక్రాంతి పండుగ తరువాత ప్రజలు తమ సొంతూళ్ల నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. అప్పుడు కూడా ఇదే మాదిరిగా రద్దీ ఉండనున్నది. ఈ నేపథ్యంలో ఇరు ప్రభుత్వాలు ప్రత్యేక బస్సులను అప్పటివరకు నడపనున్నాయి.

## హైదరాబాద్‌లోనూ ప్రయాణికుల రద్దీ..

ఇదిలా ఉంటే.. ఇటు హైదరాబాద్ లో స్థిరపడినవాళ్లు కూడా సంక్రాంతి పండుగ కోసం ఏపీలోని సొంతూళ్లకు బయలుదేరి వెళ్తున్నారు. దీంతో హైదరాబాద్ లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి.

# మీ తప్పులకు మేం తిట్లు తింటున్నాం

**మీ వద్ద దేనికీ సరైనా ప్రణాళిక లేదు.. పూర్తి విచారణ జరిపిస్తాం.. అధికారులపై పవన్ కల్యాణ్ ఫైర్**





**ఏపీ:** తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి అధికారులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ తప్పులకు మేం తిట్లు తింటున్నామంటూ ఆయన సీరియస్ అయ్యారు. తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'తిరుపతి తొక్కిసలాట ఘటన విషయమై రాష్ట్ర ప్రభుత్వం తరపున తాను క్షమాపణలు చెబుతున్నాం. ఈ ఘటన జరగకుండా ఉండాల్సింది. రద్దీని సరిగా మేనేజ్ మెంట్ చేయలేని కారణంగానే ఈ ఘటన జరిగిందంటూ భక్తులు పేర్కొంటున్నారు. అధికారులు, పోలీసులు ఉండి కూడా భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. తిరుమలలో వీఐపీలపై కాదు సామాన్య భక్తులపై టీటీడీ దృష్టిసారించాలి. ఇక మీద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనకు టీటీడీ ఈఓ, ఏఈఓనే బాధ్యత తీసుకోవాలి. అదేవిధంగా ఘటనా స్థలిలో ఉన్నటువంటి పోలీసులు కూడా బాధ్యత తీసుకోవాలి. మృతుల కుటుంబ సభ్యుల వద్దకు టీటీడీ సభ్యులు వెళ్లి క్షమాపణలు కోరాలి. అధికారులు చేసిన తప్పులకు ప్రభుత్వం తిట్లు తినాల్సి వస్తోంది. తొక్కిసలాట లేదా ఇతర అనుకోని సంఘటనలు జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనేదానిపై ఓ ప్రణాళిక లేదు. భవిష్యత్ లో ఎటువంటి దుర్ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈఓ, ఏఈఓ, పాలకమండలి మధ్య గ్యాప్ ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. అదేవిధంగా పోలీసుల్లో కొందరు కావాలని చేశారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. వీటన్నిటిపైనా విచారణ జరగాల్సి ఉంది. ఇకమీదట తిరుమలలో శ్రీవారి దర్శనం 8 గంటల్లో కాకుండా రెండుమూడు గంటల్లోనే జరిగేలా చూస్తాం' అంటూ పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కేటీఆర్ ఒక డ్రామా ఆర్టిస్ట్

## బావ, బామ్మర్ది కలిసి ఎన్నో కుంభకోణాలకు పాల్పడ్డారు

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్



**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అలియాస్ కేటీఆర్ ఒక డ్రామా ఆర్టిస్ట్ లాగా గుర్తింపు పొందారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'సుప్రీంకోర్టు, హైకోర్టులలో కేటీఆర్ కు ఊరట లభించలేదు. మతిస్థిమితం కోల్పోయి కేటీఆర్ మాట్లాడుతున్నారు. కేటీఆర్ కు హైదరాబాద్ పై ఒక స్పష్టత లేదు. ఇరిగేషన్ డిపార్ట్మెంట్లో బావ, బామ్మర్ది ఎన్నో కుంభకోణాలకు పాల్పడ్డారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో అడ్డమైన జీవోలు ఇచ్చి ప్రభుత్వ భూములను ప్రైవేటు రంగానికి, బిల్డర్లకు ఇచ్చి డబ్బులు దోచుకుతిన్నారు. కేటీఆర్ చేసిన అక్రమాలకు ఇప్పుడు కొంతమంది ఐఏఎస్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ అక్రమ ఇసుక రవాణా చేసింది మీ తమ్ముడు, మీ బాబాయ్ కాదా...? లిక్కర్ స్కామ్ లో చెల్లె కవిత ఇరుక్కుని ఊసలు లెక్క పెట్టింది నిజం కాదా..? ఛత్తీస్ గఢ్ లో అదానీతో కేసీఆర్ చేసుకున్న అక్రమ ఎలక్ట్రిసిటీ ఒప్పందాల సంగతేంటి...? ఫోన్ టాపింగ్ విషయంలో ఆర్థిక, రాజకీయ అంశాలను చేర్చి దోపిడీకి తెరలేపింది కేటీఆరే. కేసీఆర్ కుటుంబం వల్ల తెలంగాణ రాష్ట్రం దోపిడీకి గురైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కేటీఆర్ కు లేదు. ఐటీ రంగంలో హైదరాబాదును అభివృద్ధి చేశామని ఒక బోగస్ ప్రచారానికి కేటీఆర్ తెరలేపాడు. ప్రభుత్వ శాఖల్లో కేటీఆర్ చేసిన అవినీతి చిట్టాను ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ స్కీమ్ తీసుకువచ్చిన స్కామ్ కు దారి తీసింది. ఏసీబీకి పూర్తిస్థాయిలో సహకరించి నీ నిర్దోషత్వాన్ని నిరూపించుకోవాలి. దోపిడీకి పాల్పడిన కేటీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం నమ్మే పరిస్థితి లేదు' అంటూ బల్మూరి వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు.






# బాధలో బాసటగా..

## ఆదిలాబాద్ జైనథ్ మండలంలో కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్ మహా :** తమ ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారిని, అనారోగ్యంతో బాధ పడుతున్నవారిని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి దంపతులు పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ రోకండ్ల రమేష్ మృతిచెందడంతో ఆయన కుటుంబీకుల ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మాండగడ గ్రామానికి వెళ్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నర్ర తుకారాం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో అల్లూరి సుదర్శన్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా...వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు కంది దంపతులు. ఆ తర్వాత జైనథ్ మండలం కాప్రి గ్రామంలో బండి ఊశన్న ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించి ఓదార్చారు. జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో బద్దం స్వామిరెడ్డి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా అదే గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త బద్దం రవీందర్‌రెడ్డి అనారోగ్యంతో ఉండడంతో వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు.

# నిర్మల్ దేవరకోట ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



**నిర్మల్ మహా :** ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని నిర్మల్ జిల్లా కేంద్రంలోని అతి పురాతన దేవరకోట శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఉదయం 5.00 గంటలకు శేష వాహన పల్లకి సేవ అనంతరం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. 11వ తేదీన కూడారై ఉత్సవం, 13వ తేదీ సాయంత్రం 6:30 కు శ్రీ గోదా రంగనాథుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఇందులో ఆలయ ధర్మకర్తలు ఒడ్నం నరేందర్, చెటి పెల్లి సంతోష్,ఆరే చిరంజీవి,రాజన్న తదితరులున్నారు.

# ఘనంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్



## ప్రారంభించిన కలెక్టర్ ఎస్పీ

**ఆదిలాబాద్ మహా :** క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.అనునిత్యం పోలీసు విధులలో నిరంతరం పనిలో నిమగ్నమైన జిల్లా పోలీసులకు ఆటవిడుపుగా జిల్లా పోలీసు వార్షిక క్రీడలు నిర్వహించారు. ఇవాళ ఉదయం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ పాల్గొని క్రీడలను ప్రారంభించారు. రిజర్వ్ ఇన్స్పెక్టర్ వెంకటి ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా ఉన్నటువంటి డిఎఆర్ ఈగల్స్, క్యూఆర్టి విక్టర్స్,ఆదిలాబాద్ స్ట్రైకర్స్, ఉట్నూర్ చాలెంజర్స్, హెచ్ జి హంటర్స్ లుగా చక్కటి పరేడ్ ను నిర్వహించి ముఖ్యఅతిథులకు గౌరవ వందనం చేశారు. స్పోర్ట్స్ జెండాను ఆవిష్కరించిన తర్వాత శాంతి కపోతాలు, బెలూన్లను గాలిలోకి వదిలి జిల్లా పోలీసు వార్షిక క్రీడలను ప్రారంభించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని, ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడుతూ మానసిక శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఇలాంటి క్రీడా పోటీలలోనే ప్రతి ఒక్కరి ప్రతిభ కనబడుతుందని పేర్కొన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు అనునిత్యం వివిధరకాల విధులలో నిమగ్నమై ఉంటారన్నారు. ఇలాంటి క్రీడలలో పాల్గొనడం ద్వారా ఉత్సాహం కలుగుతుందన్నారు.కలెక్టర్ ,ఎస్పీ క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, హసిబిల్లా, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఇన్స్పెక్టర్లు,ఎస్సైలు, జిల్లా పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యకర్తలపై కేసులు పెట్టడం

# హేయమైన చర్య

### స్థానిక ఎన్నికలలోపు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

### బీజేపీ నాయకులు విజయచందర్ రెడ్డి, అజ్మీర సీతారాం నాయక్




**ములుగు, మహా:** బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో నిరసన తెలిపిన రాజకీయ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి విజయ చందర్ రెడ్డి, మహబూబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సిరికొండ బలరాం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. నిరసన తెలిపిన 21 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలపై కేసు పెట్టడం చాలా విడ్డూరంగా ఉందని, రాజకీయ నాయకుల పై కేసు పెట్టి జైలుకు పంపించే దిశగా కాంగ్రెస్ పరిపాలన సాగుతుందన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కేలా కాంగ్రెస్ చర్యలు ఉన్నాయని, ఇదెక్కడి న్యాయమని వారు ప్రశ్నించారు. కక్షపూరితంగా ములుగు జిల్లా బీజేపీ నాయకులను అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు చేటన్నారు. సంవత్సర కాలంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు చేసింది శూన్యమని, 420 హామీలు, ఆరు గ్యారెంటీలతో, ఇష్టానుసారంగా హిందూ దేవుళ్ల పై ప్రమాణాలు చేసి గద్దె నెక్కిన సీఎం రేవంత్ రెడ్డి హామీలను నెరవేర్చకపోవడం సిగ్గుచేటని వారు విమర్శించారు. రాష్ట్రంలో సీఎం కుర్చీకి రక్షణ లేకుండా పోయిందని, సీఎం కుర్చీని ఎవరు గుంజుకుంటారో అనే భయంతో రేవంత్ రెడ్డి నెలకు 20 సార్లు ఢిల్లీకి వెళ్లి ముడుపులు చెల్లిస్తున్నాడని, మంత్రుల మధ్య సఖ్యత లేక మంత్రి పదవులను కూడా వద్దని రాజీనామా చేసే పరిస్థితి దుస్థితిలో కాంగ్రెస్ ఉందని సీతారాం నాయక్ ఎద్దేవా చేశారు. గడిచిన సంవత్సర కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటోందని, ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను మరిపించేందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిందన్నారు. కాంగ్రెస్ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే 420 హామీలు, ఆరు గ్యారెంటీలు స్థానిక ఎలక్షన్లలోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇస్తున్న నిధులతోటి రాష్ట్రంలో సీఎం కుర్చీ నడుస్తుందని, లోటు బడ్జెట్ తో ఉద్యోగస్తులకు నెల జీతం ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్రప్రభుత్వం ఉందని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన 10 సంవత్సరాల్లో అయిన అప్పు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే సంవత్సరంలో చేసిందని, ఇంతటి దౌర్భాగ్యమైన వ్యవస్థ ఇంకా ఎక్కడైనా ఉందా అని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీర కృష్ణవేణి నాయక్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, ములుగు అసెంబ్లీ కన్వీనర్ జాడి వెంకన్న, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్ర చారి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నికల కృష్ణకరరావు తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ మండల అధ్యక్షుల ఎన్నిక**

గత నాలుగు నెలలనుండి బీజేపీ సభ్యత్వ నమోదు, క్రియాశీల సభ్యత్వాల నమోదు చేపట్టగా గురువారం బీజేపీ నాయకులు విజయచందర్ రెడ్డి, అజ్మీర సీతారాం నాయక్ ల సమక్షంలో బూత్ అధ్యక్షులను, మండల అధ్యక్షుల ఎన్నిక చేపట్టారు. ములుగు మండల అధ్యక్షునిగా రాయంచు నాగరాజు, వెంకటాపురం అధ్యక్షునిగా మార్క సతీష్, గోవిందరావుపేట అధ్యక్షునిగా పైడాకుల మల్లేష్, ఏటూనాగారం అధ్యక్షునిగా వినికోలు చక్రవర్తి, తాడ్వాయి అధ్యక్షునిగా తాళ్లపల్లి లక్ష్మణ్, మంగపేట అధ్యక్షునిగా రావుల జానకి రావు, కన్నయ్య గూడెం అధ్యక్షునిగా దుర్గం సమ్మక్క, కొత్త గూడెం అధ్యక్షునిగా యాదగిరి మురళి, గంగారం అధ్యక్షునిగా స్వర్ణపక్క నరేందర్ లు ఎన్నికయ్యారు. మండల అధ్యక్షులుగా ఎన్నికైనవారికి బీజేపీ నాయకులు విజయచందర్ రెడ్డి, అజ్మీర సీతారాం నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారు సూచించారు.

## పోలీస్ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ

# పోస్టర్ ఆవిష్కరణ




**ములుగు, మహా :** పోలీసు సేవలపై ప్రజల అభిప్రాయాలు తెలుపాలని కోరుతూ ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ ను ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ డీజీపీ, ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజల్లో నెలకొన్న అభిప్రాయాలు తెలియజేయడం కోసం క్యూఆర్ కోడ్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావడం జరిగిందన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రజా సమస్యలే పరిష్కారం ధ్యేయంగా పోలీస్ డిపార్ట్మెంట్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఏటూరునాగారం ఎస్ఐ తాజుద్దీన్, వాజేడు మండలం పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్, వెంకటాపురం సిఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై ఎన్.రాజకుమార్, వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అవకాశాలను అందిపుచ్చుకొని

# ఉన్నత స్థాయికి ఎదగాలి

### జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 8, మహా:** విద్యార్థులు తమ లక్ష్యం చేరుకునేందుకు అందుకు అనుగుణంగా కార్యాచరణ ఏర్పాటు చేసుకొని చదువుకోవాలని, ఏ స్థాయికి ఎదగాలన్నా మొదటగా కావాలసింది చదువు, నిబద్ధత అని రంగారెడ్డి జిల్లా కలక్టర్ నారానాయణ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్ లో కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఇబ్రహీంపట్నం రెవెన్యూ సిబ్బంది తమ సొంత నిధులతో విద్యార్థులకు అందించిన దుప్పట్లు, నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు. అక్కడ ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ సిబ్బంది ఎస్సి హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, నోట్ బుక్స్ పంపిణీకి ఆర్థికంగా తోడ్పాటు అందించినందుకు జిల్లా కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ వసతి గృహాలలో చదివిన ఎందరో మేధావులు, రాజకీయ వేత్తలు, అధికారులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. విద్యార్థులు వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదవడం మనకు వచ్చిన మంచి అవకాశం అని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వారి వారి లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువుతున్న ప్రతి విద్యార్థి కష్టపడాలని, అదే విధంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 10కి పది శాతం గ్రేడ్ పాయింట్లు సాధించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ కు ధీటుగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న డైట్ చార్జెస్ మార్పులపై మాట్లాడుతూ వారికి అందుతున్న డైట్ మెనూ అడిగి తెలుసుకున్నారు. మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి, అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో సునీతా రెడ్డి, మంచాల ఎమ్మార్వో ఎం.వి ప్రసాద్ రావు, హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ డీఎల్ పీఓ సాధన, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ కుసుమల లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్‌లపై ఆర్టీఏ అధికారుల దాడులు

## పెద్దఅంబర్ పేట్‌లో విజయవాడ జాతీయ రహదారిపై తనిఖీలు

### భద్రత ప్రమాణాలు పాటించలేదని 15 బస్సులకు జరిమానాలు




**అబ్దుల్లాపూర్‌మెట్, మహా:** ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల పై ఆర్టీఏ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఆర్టీఓ సుభాష్ చంద్రారెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ జాతీయ రహదారిపై ఏపీ నుండి హైదరాబాద్ కు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందిన బస్సులను తనిఖీ చేశారు. ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా కొన్ని ట్రావెల్స్ యజమాన్యాలు వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. ఆ బస్సులపై. ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించని 15 ట్రావెల్స్ బస్సులపై జరిమానాలు విధించారు. ఎంవీఐ ఎస్‌కే ముని, అనికుమార్‌లు మాట్లాడుతూ... ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు నిబంధనలకు విరుద్దంగా బస్సుల ఫిట్నెస్ లేకుండా ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రయాణికులను తరలించవద్దన్నారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే ఊరుకోకునేది లేదంటూ హెచ్చరించారు.

# గవర్నర్ దత్తత గ్రామం కొండపర్తి అభివృద్ధి పనుల పరిశీలన







## జిల్లా కలెక్టర్ దివాకర్ టి. ఎస్.

**ములుగు, మహా:** రాష్ట్ర గవర్నర్ దత్తత తీసుకున్న కొండపర్తి గ్రామంను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. గురువారం తాడువాయి మండలంలోని కొండపర్తి గ్రామంలో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు కావాలసిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో రాష్ట్ర గవర్నర్ ములుగు జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంలో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లాలోని ఒక గ్రామంను దత్తత తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించి గవర్నర్ కొండపర్తి గ్రామంను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారన్నారు. గవర్నర్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడం చాలా అదృష్టంమని అన్నారు. గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో సోలార్ ఆర్గనైజింగ్ సిస్టం ద్వారా మసాలా మేకింగ్, టైలరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. స్కూల్ అంగన్వాడీ భవనాలకు కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, వాటర్ సప్లై ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తరగతి గదులలో డ్యూయల్ డేస్ డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుకు, డ్రైనేజ్ నిర్మించుటకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి త్వరలో ఒక్కొక్క కుటుంబానికి రూ. 5 లక్షలు మంజూరు అవుతాయని, ఇండ్లు నిర్మించుకోవడానికి గ్రామ ప్రజలు అందరు కలిసి ఒక ప్రణాళిక రూపొందించు కావాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఎలక్ట్రిసిటీ డీఈ నాగేశ్వరరావు, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ అధికారులు, తహసిల్దార్, ఎంపీడీవో ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నష్టాల్లోనే దేశీయ స్టాక్ మార్కెట్లు.. 528 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలతో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహారణ, కార్పొరేట్ కంపెనీలు త్రైమాసిక ఫలితాల ప్రకటనల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 78,206.21 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 78,206.21 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 77,542.92 పాయింట్ల కనిష్ఠానికి పతనమైంది. చివరకు స్వల్పంగా కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 528.28 పాయింట్లు పతనమై.. 77,620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్లు తగ్గి 23,526.50 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,175 లాభపడగా.. మరో 2,610 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్, కోల్ ఇండియా, బీపీసీఎల్ నష్టపోయాయి. హెచ్‌యూఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, ఎంఅండ్ఎం, బజాజ్ ఆటో లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని సూచీలు.. ఐటీ, మెటల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, పవర్, రియాల్టీ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గుముఖం పట్టాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.86 వద్ద ఉన్నది.





## ఎంతసేపు భార్యను చూస్తూ ఉండిపోతారు..?

### ఆదివారాలు కూడా పనిచేయండి : ఎల్ అండ్ టీ చైర్మన్

ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను కొందరు సమర్థించగా.. చాలా మంది వ్యతిరేకించారు. తాజాగా ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ సైతం ఇదే తరహా వ్యాఖ్యలే చేశారు. అయితే, నారాయణమూర్తి కంటే ఆయన ఓ అడుగు ముందుకేసి.. వారానికి 90 గంటలు పనిచేయాలని తన ఉద్యోగులకు సూచించారు.

తన ఉద్యోగులతో ఇంటరాక్షన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని సూచించారు. అవసరమైతే ఆదివారాలు కూడా వదులుకోవాలన్నారు. ఎంతసేపు అలా భార్యను చూస్తూ ఉండిపోతారు..? అంటూ ప్రశ్నించారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలతో చెప్పాలని ఉద్యోగులతో అన్నారు. 'ఆదివారాలు మీతో పనిచేయించలేకపోతున్నందుకు బాధపడుతున్నా. మీతో ఆదివారాలూ పనిచేయించగలిగితే నేను మరింత సంతోషంగా ఉంటాను. ఎందుకంటే నేను ఆదివారాలు కూడా పనిచేస్తున్నాను' అని ఉద్యోగులతో అన్నారు. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

కాగా, ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే ఉత్పాదకత అతి తక్కువ. ఉత్పత్తిలో మన పని మెరుగు పర్చుకోలేకపోయినా, ప్రభుత్వంలో కొంత స్థాయి వరకూ అవినీతి తగ్గించకపోయినా.. అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలతో మనం పోటీ పడలేం' అని నారాయణ మూర్తి స్పష్టం చేశారు. 'నా యువతరానికి నేను చేసే రిక్వెస్ట్ ఒకటే.. 'ఇది నా దేశం. నా దేశం కోసం నేను వారానికి 70 గంటలు పని చేస్తాను' అని తప్పనిసరిగా ప్రతిజ్ఞ చేయాలి` అని నారాయణ మూర్తి చెప్పారు.

## వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్..

### త్వరలోనే మరో మూడు ఫీచర్లు అందుబాటులోకి..!



మెటా యాజమాన్యంలో వాట్సాప్‌కు ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున యూజర్లు ఉన్నారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు యూజర్లను ఆకట్టుకునేందుకు కంపెనీ కొత్త కొత్త ఫీచర్లను పరిచయం చేస్తూ వస్తున్నది. గతేడాది ఏఐ సాంకేతికను జోడించి వాట్సాప్ రూపురేఖలనే మార్చేసింది. తాజాగా నూతన సంవత్సరంలో మరో మూడు ఫీచర్స్‌ను యూజర్లకు అందుబాటులోకి తీసుకురాబోతున్నది. మెటా ఏఐ ఫీచర్స్‌ను వాట్సాప్ సిద్ధం చేస్తున్నది. దీంతో వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండనున్నది.

**వాట్సాప్‌లో రాబోయే ఫీచర్లు ఇవే..**

**మెటా ఏఐ షార్ట్‌కట్ :** మెటా ఏఐ చాట్‌బాట్‌లో ఇన్‌స్టంట్ యాక్సెస్ కోసం షార్ట్‌కట్ బటన్‌పై వాట్సాప్ పని చేస్తుంది. ఈ బటన్ సహాయంతో యూజర్లు మెటా ఏఐని ఉపయోగించి వారి సమస్యలను సులభంగానే పరిష్కరించుకోవచ్చు. అవసరమైన సలహాలను సైతం పొందేందుకు వీలుంటుంది. ఈ బటన్ ప్రస్తుతం చాట్‌ల ట్యాబ్‌లో అందుబాటులో ఉంటుంది. ఇది విజిబిలిటీని పెంచడంతో పాటు యూజర్లు సులభంగా యాక్సెస్ చేయొచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ ఐఓఎస్‌లో టెస్టింగ్ దశలో ఉంది. త్వరలోనే మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**మెటా ఏఐకి మెసేజ్ ఫార్వర్డింగ్:** ప్రస్తుతం మెటా ఏఐకి మెసేజ్ ఫార్వర్డ్ చేసే ఫీచర్‌పై వాట్సాప్ పని చేస్తుంది. ఈ ఫీచర్‌లో యూజర్లు మెటా ఏఐకి ఏదైనా మీడియా లేదంటే మెసేజ్‌ను పంపుకోవచ్చు. టెక్ట్స్‌ను కాపీ పేస్ట్ చేసుకోవచ్చు. స్పామ్ మెసేజ్‌లను చెక్ చేసుకొని చేసుకొని వెరిఫై చేసుకునేందుకు ఈ ఫీచర్ వినియోగదారులకు సహాయపడనున్నది. సరళంగా చెప్పాలంటే ఫ్యాక్ట్ చెకింగ్‌గా ఉపయోగపడనున్నది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ యూజర్లకు అభివృద్ధి చేస్తున్నది. త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**మెటా ఏఐ చాట్ మెమరీ :** మెటా వాట్సాప్‌లో ఏఐని మరింత దగ్గర చేసుందుకు చాట్ మెమొరీ ఫీచర్‌ను తీసుకువస్తున్నది. దీంతో పర్సనల్ అసిస్టెన్స్ మెరుగవనున్నది. యూజర్లు ఏఐని అడిగిన ప్రశ్నలను గుర్తుంచుకుంటుంది. యూజర్లు ఏ సమయంలో ఏం తింటారు.. ఎలాంటి వస్తువులను ఇష్టపడుతున్నారనే.. అయిష్టాలు ఏమున్నాయనే అనే విషయాలను గుర్తుంచుకుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని గుర్తుంచుకొని.. ఎప్పుడైనా మళ్లీ ప్రశ్నలు అడిగిన సమయంలో డేటా సహాయంతో సమాధానం ఇస్తుంది.



## మార్కెట్లోకి షియోమీ బడ్జెట్ 5జీ ఫోన్..


## ధర ఎంతంటే?

**హైదరాబాద్ :** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీ.. దేశీయ మార్కెట్లోకి చౌక ధరకలిగిన 5జీ స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెడ్మీ నోట్ 14 సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఈ స్మార్ట్‌ఫోన్ రూ.9,999 ప్రారంభ ధర కాగా, గరిష్ఠంగా రూ.11,999కి లభించనున్నది. 6.88 ఇంచుల హెచ్‌డీడాట్ డ్రాప్ డిస్‌ప్లేతో తయారైన ఈ స్మార్ట్‌ఫోన్ స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 2 5జీ ప్రాసెసర్, 12 జీబీ ర్యామ్, 50 మెగాపిక్సెల్ ఏఐ డ్యూయల్ కెమెరా సిస్టమ్, 5160 మెగావాట్ల బ్యాటరీ, 128 జీబీ మెమొరీని 1 టీబీకి పెంచుకునే విధంగా తయారు చేసింది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





## ప్రయాణికుడి బ్యాగ్‌లో మొసలి తల..

### ఎయిర్‌పోర్ట్‌లో స్వాధీనం

న్యూఢిల్లీ: ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ఒక ప్రయాణికుడిపై సెక్యూరిటీ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. అతడి లగేజ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో మొసలి తల ఉండటం చూసి షాక్ అయ్యారు. దానిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయం విమానాశ్రయంలో ఈ సంఘటన జరిగింది. జనవరి 6న కెనడా పౌరుడైన వ్యక్తి టొరంటో వెళ్లేందుకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. ఎయిర్ కెనడా విమానం ఎక్కే ముందు సెక్యూరిటీ సిబ్బంది అతడ్ని చెక్ ఇన్ చేశారు. ఆ వ్యక్తిపై అనుమానం రావడంతో టెర్మినల్ 3 వద్ద లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీంతో ఒక బ్యాగ్‌లో మొసలి తల ఉండటాన్ని సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. కాగా, కస్టమ్స్ అధికారులు ఆ మొసలి తలను స్వాధీనం చేసుకున్నారు. దానిని గుడ్డతో చుట్టి లగేజ్‌లో అతడు ఉంచినట్లు తెలిపారు. 777 గ్రాముల బరువున్న మొసలి తలను ఢిల్లీకి చెందిన అటవీశాఖ అధికారులు పరిశీలించారు. మొసలి పిల్లకు చెందినదిగా వారు నిర్ధారించారు. దర్యాప్తు కోసం డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు దానిని పంపారు. ఆ కెనడా పౌరుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐరన్ ఫ్యాక్టరీలో కూలిన పొగగొట్టం


### చిమ్నీ కింద చిక్కుకున్న 30 మంది కూలీలు..!



ఇనుము తయారీ కంపెనీ లో ఘోర ప్రమాదం జరిగింది. కంపెనీలో పొగగొట్టం ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ఆ సమయంలో పొగగొట్టం సమీపంలోనే పనిచేస్తున్న దాదాపు 30 మంది కూలీలు దాని కింది చిక్కుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ముంగేలి జిల్లాలోని సర్గావ్ పట్టణంలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్న రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టాయి. తీవ్రంగా గాయపడిన ఒక కూలీని చిమ్నీ కింద నుంచి బయటికి తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాయి. మిగతా కూలీలను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## రూ.1,033 కోట్లతో శబరిమల అభివృద్ధి..


### మాస్టర్ ప్లాన్‌కు కేరళ మంత్రివర్గం ఆమోదం



**తిరువనంతపురం:** కేరళలోని ప్రసిద్ధ శబరిమలను రూ.1,033.62 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సన్నిధానం, పంపా, ట్రక్ రూట్ వంటి కీలక ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి బ్లూప్రింట్ రూపొందించారు. మొత్తం రూ.778.17 కోట్ల వ్యయంతో సన్నిధానం ప్రాంతాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశ పనులకు రూ. 600.47 కోట్లు, 20282033 మధ్య చేపట్టనున్న రెండో దశ పనులకు రూ. 100.02 కోట్లు, 203439 మధ్య చేపట్టనున్న మూడో దశ పనులకు రూ.77.68 కోట్లు కేటాయించనున్నారు. కాగా, అయ్యప్ప స్వామి సన్నిధానం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతకు భంగం కలుగకుండా లేఅవుట్ ప్లాన్ రూపొందించినట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రాంతాన్ని ఎనిమిది జోన్‌లుగా విభజించినట్లు పేర్కొంది. మకరవిళక్కు (మరక జ్యోతి) దృశ్యాలు కనిపించేలా, భక్తుల రద్దీని నియంత్రించేలా రెండు ఓపెన్ ప్లాజాలు నిర్మించనున్నట్లు వెల్లడించింది. మరోవైపు అటవీ మార్గంలో ప్రయాణించే యాత్రికుల సురక్షితం, సౌకర్యం కోసం వాహన రూట్ లేఅవుట్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ మార్గంలో షెల్టర్లు, విశ్రాంతి భవనాలు నిర్మిస్తారు. రోడ్డుకు రెండు వైపులా అత్యవసర వాహన లేన్, పర్యావరణ పునరుద్ధరణ కోసం బఫర్ జోన్‌లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ. 47.97 కోట్ల వ్యయంతో ట్రక్ రూట్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. తొలి దశ పనులకు రూ.32.88 కోట్లు, రెండో దశ పనులకు రూ.15.50 కోట్లు కేటాయించనున్నారు. కాగా, పంపా అభివృద్ధికి రూ.207.48 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు.

## ఆ కూతల పార్టీకి ఎలాంటి ఎజెండా లేదు

### బీజేపీపై ఢిల్లీ సీఎం అతిషి ఫైర్




బీజేపీపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి తీవ్ర విమర్శలు చెప్పారు. బీజేపీ ఎప్పుడూ ప్రత్యర్థి పార్టీలను దూషిస్తూ ఉంటుందని, ఆ కూతల పార్టీకి ఒక ఎజెండా అంటూ లేనేలేదని ఆమె మండిపడ్డారు. ఆప్ చీఫ్ అర్వింద్ కేజ్రీవాల్‌ను దూషించడమే వారికున్న ఏకైక ఎజెండా అని ఎద్దేవా చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తమ చీఫ్ మినిస్టర్ అభ్యర్థి ఎవరో కూడా ప్రకటించే స్థితిలో లేదని విమర్శించారు.

ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో ఢిల్లీ ప్రజలే నిర్ణయించుకోవాలని, బీజేపీ వైఖరిని చూస్తుంటే ప్రజలకు నిర్ణయం తీసుకోవడం చాలా సులువే అనిపిస్తోందని అతిషి వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలోని గోవింద్‌పురిలో ఆప్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అతిషి మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా బరిలో దిగుతుండటంతో అక్కడ త్రిముఖ పోరు నెలకొంది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ ఎన్నికల కోసం జనవరి 10 నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించనున్నారు. 18న నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహిస్తారు. జనవరి 20 వరకు నామినేషన్‌లు ఉపసంహరించుకోవచ్చు.

## నిజ్జార్ హత్య కేసు..

### నలుగురు భారతీయులకు కెనడా కోర్టు బెయిల్



**బ్రిటీష్ కొలంబియా:** ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసులో నిందితులుగా ఉన్న నలుగురు భారతీయులకు ఇవాళ కెనడా సుప్రీంకోర్టుబెయిల్ మంజూరీ చేసింది. బ్రిటీష్ కొలంబియా అత్యున్నత కోర్టులో ఫిబ్రవరి 11వ తేదీన మళ్లీ ఈ కేసుపై విచారణ జరగనున్నది. హత్య కేసులో ఆధారాలు సరిగా లేని కారణంగా.. నిందితులకు బెయిల్ మంజూరీ చేస్తున్నట్లు కోర్టు వెల్లడించింది. కరణ్ బ్రార్, అమన్‌దీప్ సింగ్, కమల్‌ప్రీత్ సింగ్, కరణ్‌ప్రీత్ సింగ్‌లపై ఫస్ట్ డిగ్రీ మర్డర్, కుట్ర కేసు నమోదు అయ్యింది. బ్రిటీష్ కొలంబియా రాష్ట్రంలోని సర్రేలో ఉన్న గురుద్వారా వద్ద నిజ్జార్‌ను 2023, జూన్ 18వ తేదీన కాల్చి చంపిన విషయం తెలిసిందే. కెనడా రాయల్ పోలీసులు.. 2024 మే నెలలో కరణ్‌ప్రీత్, కమల్‌ప్రీత్, కరన్ బ్రార్‌ను అరెస్టు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముగ్గురు నిందితులు ఇవాళ కోర్టు విచారణకు హాజరయ్యారు. ఒకరు నేరుగా కౌన్సిల్ ద్వారా కోర్టుకు హాజరయ్యారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసులో ప్రత్యక్షంగా భారత హస్తం ఉన్నట్లు కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో కీలక ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ ఆరోపణలను భారత్ ఖండించింది. తీవ్రవాదానికి, ఇండియా వ్యతిరేక శక్తులకు కెనడా ఆశ్రయం కల్పిస్తున్నట్లు భారత్ కౌంటర్ ఆరోపణ చేసింది.

## డబ్బు అప్పుగా తీసుకుని చెల్లించలేదని..

## మహిళా సహోద్యోగిని కత్తితో నరికి చంపిన వ్యక్తి



**ముంబై:** బీపీవో కంపెనీలో పని చేస్తున్న మహిళ తన సహోద్యోగి నుంచి అప్పుగా డబ్బు తీసుకున్నది. తిరిగి చెల్లించకపోవడంపై అతడు ఆగ్రహించాడు. ఈ నేపథ్యంలో జనం చూస్తుండగా కత్తితో దాడి చేసి నరికాడు. తీవ్రంగా గాయపడిన ఆ మహిళ మరణించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. యెరవాడలోని బీపీవో సంస్థలో 28 ఏళ్ల శుభద శంకర్ కొడారే నాలుగేళ్లుగా పని చేస్తున్నది. జనవరి 7న సాయంత్రం బస్సులో అక్కడకు చేరుకున్నది. అదే కంపెనీలో పని చేస్తున్న సహోద్యోగి అయిన 30 ఏళ్ల కృష్ణ సత్యనారాయణ కనోజా కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆ సంస్థ పార్కింగ్ ఏరియాలో అంతా చూస్తుండగా కత్తితో శుభద చేతిని నరికాడు. కాగా, కృష్ణ చేతిలోని కత్తి చూసి అక్కడున్న వారు ఆ మహిళను కాపాడేందుకు సాహసించలేదు. అయితే కొందరు వ్యక్తులు రాళ్లతో అతడిపై దాడి చేసేందుకు ముందుకు వచ్చారు. ఇది చూసి తన చేతిలోని కత్తిని అతడు కింద పడేశాడు. దీంతో వారు కృష్ణను పట్టుకుని కొట్టారు. అక్కడకు చేరుకున్న పోలీసులకు అతడ్ని అప్పగించారు. మరోవైపు కత్తి దాడిలో గాయపడిన శుభదను ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్ర రక్తస్రావం వల్ల చికిత్స పొందుతూ ఆమె మరణించింది. మృతురాలు సతారా జిల్లాలోని కరాడ్‌కు చెందినట్లు పోలీసులు గుర్తించారు. తండ్రికి వైద్యం కోసం నాలుగు లక్షలు అప్పుగా కృష్ణ నుంచి ఆమె తీసుకున్నదని తెలిపారు. డబ్బు తిరిగి ఇవ్వాలని కృష్ణ అడిగినా ఆమె చెల్లించలేదని చెప్పారు. ఈ వివాదం నేపథ్యంలో అతడు కత్తితో శుభదపై దాడి చేసి ఆమెను హత్య చేశాడని వివరించారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, ఈ సంఘటనను మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## సోషల్ మీడియాలో వేధింపులు

### సైబర్ క్రైమ్‌ను ఆశ్రయించిన మరో నటి

సోషల్ మీడియా ద్వారా వేధింపులు పెరిగిపోతున్నాయి. సామాన్యులతోపాటు పలువురు సెలబ్రిటీలు కూడా లైంగిక వేధింపులకు గురవుతున్నారు. మొన్నటికి మొన్న మలయాళీ బ్యూటీ హనీరోజ్.. సోషల్ మీడియా ద్వారా తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో నటికి కూడా అదే పరిస్థితి ఎదురైంది. కథానాయిక నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో వేధింపులు ఎదుర్కొంది. ఈ విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియా ద్వారా తనను ఇబ్బందికి గురిచేస్తూ, వేధిస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాదు తనను చంపేస్తానంటూ బెదిరింపు కామెంట్స్ పెడుతున్నట్లు తెలిపింది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. నటి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, నిధి అగర్వాల్ ప్రస్తుతం రెండు భారీ ప్రాజెక్ట్స్ చేస్తోంది. ఇద్దరు సూపర్‌స్టార్లతో రెండు పాన్ ఇండియా చిత్రాల్లో మెరిసేందుకు సిద్ధమైంది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో 'హరిహర వీరమల్లు', పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్'లో నటిస్తోంది. ఈ రెండు పాన్‌ఇండియా సినిమాలూ 2025లోనే విడుదల కానున్నాయి. ఇక ఈ రెండు చిత్రాలతోపాటు తెలుగు, తమిళంలో మరికొన్ని సర్‌ప్రైజింగ్ మూవీస్‌లో నటిస్తోంది ఈ ఇస్మార్ట్ భామ.



## బ్యాక్ టు యాక్షన్ మూడ్.. కార్ రేసింగ్ టీంతో అజిత్‌కుమార్..!



దుబాయ్ కార్ రేసింగ్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్‌కుమార్ భారీ ప్రమాదం నుంచి బయటపడ్డ సంగతి తెలిసిందే. దుబాయ్‌లో రేసింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా అజిత్ కారు ట్రాక్‌ను ఢీకొట్టింది. అయితే అప్రమత్తమైన అజిత్‌కుమార్ వెంటనే కారును కంట్రోల్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది.. స్వల్ప గాయాలతో కారులో నుంచి బయటపడ్డాడు అజిత్ కుమార్. అయితే అజిత్ కుమార్ అభిమానుల్లో జోష్ నింపే వార్త ఒకటి ఫొటోల రూపంలో బయటకు వచ్చింది. అజిత్‌కుమార్ రేసింగ్ టీంతో కలిసి ఫొటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. అజిత్‌కుమార్ రేసింగ్ గురించి అతని మేనేజర్ సురేశ్ చంద్ర మాట్లాడుతూ..ఈ శనివారం జరగనున్న ఎండ్యూరెన్స్ రేసు (Dubai 24H event)లో పాల్గొనే నలుగురు డ్రైవర్లలో మిస్టర్ అజిత్ ఒకరు. ఆయన వరుసగా నాలుగు గంటలు డ్రైవింగ్ ప్రాక్టీస్ చేశారు. చివరగా దాదాపు 33.5 గంటలు డ్రైవింగ్ చేశాడు. అయితే కొంచెం దృశ్యమానత (విజిబులిటి)లో నెలకొన్న సమస్య కారణంగా జరిగిన ప్రమాదంలో కారు దెబ్బతిన్నది. అయితే ఆయనకు ఏం కాలేదు. అంబులెన్స్ స్పాట్‌కు చేరుకుంది. అజిత్ కారులో నుంచి బయటకు వచ్చి.. దగ్గరలో ఉన్న గ్రిడ్‌కు వెళ్లారు. వైద్యులు ఆయన ఆరోగ్యాన్ని పరిశీలించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆయన నెక్స్ట్ ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా నేటి నుంచి యాక్షన్‌లోకి దిగుతారని చెప్పాడు. ఈ నేపథ్యంలో తాజా ఫొటోలు చూసిన అభిమానులు అజిత్‌కుమార్ యాక్షన్ మూడ్‌లోకి వచ్చేశాడంటూ సంబురాలు చేసుకుంటున్నారు.



## శ్రద్ధాకపూర్ న్యూ హెయిర్ కట్..

తెలుగులో సూపర్ క్రేజ్‌తోపాటు మంచి ఫ్యాన్ బేస్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్. ప్రభాస్‌తో కలిసి నటించిన సాహో చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. శ్రద్ధాకపూర్ ఓ వైపు గ్లామరస్ రోల్స్ చేస్తూనే మరోవైపు నటనకు ఆస్కారమున్న పాత్రల్లో నటిస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటుంది. గతేడాది స్త్రీ 2 సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఈ భామ నెట్టింట ఎంత చురుకుగా ఉంటుందో తెలిసిందే. తాజాగా శ్రద్ధాకపూర్ న్యూ హెయిర్ కట్ చేయించుకుంది. సెలూన్‌లో హెయిర్ స్టైల్ సెట్ చేయించుకున్న తర్వాత సెల్ఫీ దిగింది శ్రద్ధాకపూర్. కొత్త సంవత్సరం.. కొత్త జుట్టు.. అంటూ న్యూ హెయిర్ స్టైల్‌కు క్యాప్షన్ ఇచ్చింది. ఇప్పుడీ స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రద్ధాకపూర్ ఇలా కొత్త హెయిర్ స్టైల్ చేయించుకోవడం వెనుక సీక్రెట్ ఏమైనా ఉందా..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు మూవీ లవర్స్. స్త్రీ 2 తర్వాత శ్రద్ధాకపూర్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.

## బీటౌన్ హీరోతో శ్రీలీల డేటింగ్..?



శ్రీలీల.. ఈ పేరు తెలియని వారు ఉండరు. పెళ్లి సందD చిత్రంతో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. కొన్ని నెలల క్రితం వరకు వరుస ఫ్లాప్స్ చూసి.. ఇక శ్రీలీల పని అయిపోయింది అనుకున్నారు అంతా. కానీ, ఇటీవలే రిలీజైన 'పుష్ప 2'లో ఆమె చేసిన 'కిస్సిక్' సాంగ్‌తో నేషనల్ వైడ్‌గా విపరీతమైన క్రేజ్‌ని సొంతం చేసుకుంది. ఈ సాంగ్ తర్వాత ఆమెను అంతా శ్రీలీలకు బదులు 'కిస్సిక్ లీల' అని పిలుస్తున్నారు. ఇదిలా ఉంటే.. శ్రీలీలకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం నెట్టింట షేక్ చేసేస్తోంది. ఆమె ఓ బాలీవుడ్ హీరోతో డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీలీల తాజాగా ముంబైలో దర్శనమిచ్చింది. అక్కడ ఓ రెస్టారెంట్‌లో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్‌తో కలిసి కనిపించింది. వీరిద్దరూ రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చిన అనంతరం మీడియాకి ఫోజులు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు వీరిద్దరూ కలుసుకోవడంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వీరు ఇప్పుడు ఎందుకు కలుసుకున్నారు..? ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారా..? అంటూ చర్చించుకుంటున్నారు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## అకిబ్ జావేద్‌ను చూసి గంభీర్ నేర్చుకోవాలట..?

### హెడ్‌కోచ్‌కు పాక్ మాజీ కెప్టెన్ బాసిత్ అలీ అడ్వైజ్..!



బోర్డర్‌గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో 31 తేడాతో టీమిండియా ఓటమిపాలైంది. దాంతో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు నుంచి వైదొలిగించింది. ఆస్ట్రేలియా వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరింది. జూన్‌లో ఇంగ్లాండ్ లార్డ్స్‌లో జరిగే దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా తలపడనున్నది. భారత జట్టు ఇప్పటి వరకు రెండుసార్లు ఫైనల్‌కు చేరింది. తొలిసారిగా టెస్టుల్లో ప్రదర్శన ఆకట్టుకోలేకపోవడంపై ఫైనల్ నుంచి నిష్క్రమించింది. ఈ క్రమంలో దాయాది పాకిస్థాన్ ఇప్పటి వరకు మూడు సైకిల్స్‌లో పాక్ తొలి మూడుస్థానాలు సైతం చేరుకోలేకపోయింది. ఆ దేశ మాజీలు టీమిండియాకు సలహాలు ఇస్తున్నారు. పాక్ ప్రస్తుత కోచ్ అకిబ్ జావేద్‌ను చూసి నేర్చుకోవాలని హెడ్‌కోచ్ గంభీర్‌కు మాజీ కెప్టెన్ బాసిత్ అలీ సూచించాడు. భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్ సంస్కృతిని తొలగించాలని.. పాక్ జట్టులో జావేద్ అదే చేశాడని చెప్పుకొచ్చారు. గంభీర్ కోచింగ్‌లో టీం ఇండియా ప్రదర్శన అంత బాగాలేదని అలీ పేర్కొన్నారు. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్ట్ సిరీస్, అలాగే ఆస్ట్రేలియాలోనూ ఓటమిపాలైంది. అదే సమయంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో మధ్యలోనే బాబర్ ఆజం, షాహీన్ అఫ్రిది, నసీమ్ షాలను జావేద్ తొలగించాడని.. దాంతోనే ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను గెలిచిందని తెలిపాడు. గౌతమ్ గంభీర్ సైతం సరిగా రాణించని ఆటగాళ్లను తొలగించాలని.. స్థిరంగా ఆడేవారిని తీసుకోవాలని సూచించారు.సూపర్ స్టార్ సంస్కృతిని ముగించి.. వారికి ప్రత్యామ్నాయం లేదని భావించే స్థానంలో కొత్త వారిని తీసుకువచ్చి.. అందరూ సమానమేనని జావేద్ చేసి చూపించాడని మాజీ పాక్ కెప్టెన్ పేర్కొన్నాడు. పాక్ మాజీ కెప్టెన్ టీమిండియాకు సలహాలు ఇవ్వడంపై పలువురు మాజీలు విమర్శిస్తున్నారు. ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ పాయింట్ల పట్టికలో ఉన్న తొమ్మిది జట్లలో పాక్ ఎనిమిదో స్థానంలో ఉన్నది. గత టెస్ట్ సైకిల్‌లో 12 మ్యాచుల్లో కేవలం నాలుగు మాత్రమే దాయాది గెలిచింది. ఆ దేశానికి 27.78పాయింట్లు ఉన్నారు. ఇదే సైకిల్‌లో టీమిండియా 19 టెస్టులు ఆడి.. తొమ్మిది గెలిచింది. ఎనిమిది మ్యాచుల్లో ఓటమి పాలు కాగా.. రెండు టెస్టులు డ్రా చేసుకుంది.



## 12 ఏండ్లలో అత్యల్పం

### మరింత దిగజారిన కోహ్లీ ర్యాంకు
### రోహిత్ పరిస్థితి అధ్వాన్నం

దుబాయ్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో పేలవ ఫామ్‌తో ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్న భారత దిగ్గజ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తాజాగా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో మరింత దిగజారారు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్ జాబితాలో కోహ్లీ.. మూడు స్థానాలు దిగజారి 27వ ర్యాంక్‌కు పడిపోగా రోహిత్‌శర్మ 42వ స్థానంలో ఉన్నాడు. గడిచిన 12 ఏండ్ల కాలంలో టాప్25లో లేకపోవడం కోహ్లీకి ఇదే తొలిసారి. 2012 డిసెంబర్‌లో కోహ్లీ చివరి సారిగా 36వ ర్యాంకులో ఉన్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో పెర్త్ టెస్టు సెంచరీ మినహా మిగిలిన 8 ఇన్నింగ్స్‌లో కోహ్లీ చేసింది 90 పరుగులే. ఆఫ్‌స్టంప్ అవతల వెళ్తున్న బంతులను వేటాడి బలైన కోహ్లీ.. ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్‌కు నాలుగు సార్లు ఇదే రూపంలో వికెట్ సమర్పించుకున్నాడు. ఇక గతేడాది స్వదేశంలో బంగ్లాదేశ్ సిరీస్‌కు ముందు ఆరో స్థానంలో ఉన్న రోహిత్ ర్యాంకు క్రమంగా దిగువకు పడిపోయింది. న్యూజిలాండ్‌తో 3 మ్యాచ్‌ల సిరీస్ తర్వాత 26కు పడిపోయిన హిట్‌మ్యాన్ ర్యాంకు.. తాజాగా 42వ ర్యాంక్ వద్ద నిలిచింది. ఈ జాబితాలో టాప్10లో నిలిచిన బ్యాటర్లలో భారత్ నుంచి యశస్వీ జైస్వాల్ (4), రిషభ్ పంత్ (9) ఉన్నారు.




## శ్రీలంక పర్యటనకు ఆస్ట్రేలియా జట్టు

### కెప్టెన్‌గా స్టీవ్ స్మిత్

శ్రీలంక పర్యటన కోసం ఆస్ట్రేలియా గురువారం జట్టును ప్రకటించింది. శ్రీలంక పర్యటనలో ఆస్ట్రేలియా రెండు టెస్టులు ఆడనున్నది. ఈ రెండు మ్యాచులు గాలే స్టేడియంలోనే జరుగనున్నాయి. లంకలోని పిచ్‌లను దృష్టిలోపెట్టుకొని క్రికెట్ ఆస్ట్రేలియా ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లకు అవకాశం కల్పించింది. ఆసిస్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌కు లంక సిరీస్‌కు విశ్రాంతినివ్వగా.. స్టీవ్ స్మిత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. దాదాపు 22 నెలల తర్వాత టెస్టుల్లో మళ్లీ కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు. చివరిసారిగా 2023 మార్చిలో ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్‌గా పని చేశాడు. భారత్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో మూడో టెస్ట్ తర్వాత ఉద్వాసనకు గురైన నాథన్ మెక్‌స్వీనికి మళ్లీ చోటు కల్పించింది. ఆస్ట్రేలియా ఇప్పటికే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకుంది. జూన్ 11 నుంచి లార్డ్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగే ఫైనల్‌లో ఆస్ట్రేలియా తలపడనున్నది.

#### శ్రీలంక పర్యటనకు ఆస్ట్రేలియా జట్టు

స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, స్కాట్ బోలాండ్, అలెక్స్ కారీ, కూపర్ కొన్నోలీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, శామ్ కాన్‌స్టాస్, మాట్ కుహ్నెమాన్, మార్నస్ లాబుస్‌చగ్నే, నాథన్ లియాన్, నాథన్ మెక్‌స్వీనీ, టాడ్ మర్ఫీ, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్.



## స్టేడియాల పునరుద్ధరణ పనులపై ఐసీసీ నిఘా..!

వచ్చే నెలల్ చాంపియన్స్ ట్రోఫీలోని మ్యాచులకు ముందు టీమిండియా దుబాయిలో ప్రాక్టీస్ మ్యాచులు ఆడనున్నది. ప్రస్తుతం ఐసీసీ ప్రాక్టీస్ మ్యాచులకు సంబంధించిన షెడ్యూల్‌తో పాటు నాలుగు వేదికల్లో సదుపాయాల కల్పనపై పని చేస్తున్నది. అదే సమయంలో పాకిస్థాన్‌లో మూడు స్టేడియాల్లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులపై ఐసీసీ నిఘా వేసింది. పలు మీడియా నివేదికల ప్రకారం.. ప్రస్తుతం స్టేడియాల పునర్నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ వరకు పనులు పూర్తయ్యేది అనుమానమేనని పలు నివేదికలు పేర్కొన్నాయి. ఐసీసీ సభ్య బృందం ఇప్పటి వరకు స్టేడియం పునర్నిర్మాణ పనులపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

ఐసీసీ ఈవెంట్ కోసం కరాచీ, లాహోర్, రావల్పిండిలో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 1996 ప్రపంచ కప్ తర్వాత పాక్‌లో కీలకమైన టోర్నమెంట్‌ను నిర్వహిస్తుండడం ఇదే తొలిసారి. అయితే, ఈ టోర్నీ సైతం హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతున్నది. టీమిండియా మ్యాచులు దుబాయి వేదికగా ఆడనున్నది. అయితే, స్టేడియాల పునర్నిర్మాణ పనులపై వస్తున్న వార్తలను పీసీబీ తోసిపుచ్చింది. చాంపియన్స్ ట్రోఫీకి సన్నాహాలు జోరుగానే సాగుతున్నాయని పేర్కొంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం, కరాచీలోని నేషనల్ బ్యాంక్ స్టేడియం పునరుద్ధరణ పనులు గడువుకు ముందే పూర్తవుతాయని చెప్పింది. గడాఫీ స్టేడియంలో కొత్త కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారని.. దాంతో సీటింగ్ సామర్థ్యం 35000 వేలకు పెరుగుతుంది, 480 ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పింది.

స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత.. జనవరి చివరి వారంలో స్టేడియం ప్రారంభించనున్నట్లు పేర్కొంది. కరాచీ స్టేడియంలో 350 ఎల్‌ఈడీ లైట్లు.. రెండు భారీ స్క్రీన్స్ ఏర్పాటు చేయడంతో పాటు 5వేలు అదనంగా సీటింగ్ సామర్థ్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రావల్పిండి స్టేడియంలోనూ ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి మొదలుకానున్నది. ఇందులో ఎనిమిది జట్లు పాల్గొననుండగా.. రెండు గ్రూపులుగా విభజించారు. లీగ్ దశలో 12 మ్యాచులు ఉంటాయి. ఆ తర్వాత సెమీ ఫైనల్స్, ఫైనల్ ఉంటుంది. భారత్‌లో తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడుతుంది. ఇక దాయాది పాకిస్థాన్‌తో 23న తలపడనున్నది. భారత్ ఫైనల్‌కు చేరుకుంటే.. టైటిల్ మ్యాచ్ సైతం దుబాయిలోనే ఉంటుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com